సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
ఆదివారం, 03.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 191
పేజీలు: 12 వెల: రూ. 5

## ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్‌లే

**ప్రభుత్వ విప్ లతో సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి**



ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్ లే అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎంసీ హెచ్ ఆర్డీలో శాసనసభ, శాసనమండలి విప్ లతో రేవంత్ సమావేశమయ్యారు. ప్రజా సమస్యలను విప్ లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయరమణరావు, రామచంద్రు నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్ పాల్గొన్నారు.

## పవన్‌కు చంద్రబాబు పరామర్శ

**శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతిలో పవన్ కళ్యాణ్**

- హైదరాబాద్ నివాసంలో పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సీఎం చంద్రబాబు
- పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, వైద్యుల సూచనలు పాటించాలని సూచించిన సీఎం
- అభిమానులకు ధైర్యం ఇచ్చిన సీఎం పరామర్శ

03



విద్య, వైద్యం ఫ్రీగా ఇవ్వకుంటే

## రాళ్లతో కొట్టండి

**మా నాన్న కేసీఆర్ ను తిట్టలేదు..**

**బీఆర్ఎస్ అధ్యక్షుడిని విమర్శించా**

- వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించుతాం
- మీట్ ది ప్రెస్ లో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** విద్య వైద్యం ఫ్రీగా ఇవ్వకుంటే రాళ్లతో కొట్టాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తాము ఇచ్చిన పాంచజన్యంలో పేర్కొన్న ఐదు అంశాలను అమలు చేయకుంటే గన్ పార్క్‌లోని అమరుల స్థూపం స్తంభానికి కట్టేసి కొట్టాలని సూచించారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మిగతా 02లో

## కేసీఆర్‌ను హింసిస్తున్నావు

కవితకు ఎమ్మెల్యే దానం హితవు



- నీది స్వార్థ రాజకీయం
- తండ్రిని, ఇంటి సమస్యలను వీధిలోకి తీసుకురావడం సరికాదు
- కేసీఆర్ ఓ మాస్ లీడర్
- ప్రజల్లోకి ఎప్పుడు రావాలో ఆయనకు తెలుసు

03

## ప్రతి హామీ నెరవేర్చుతాం



- సంక్షేమ పథకాలు మౌలిక సదుపాయాల కల్పన కోసమే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక..
- జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు..
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

03

## మేమున్నాం.. ఆదుకుంటాం..

ఓఆర్ఆర్ ప్రమాద కుటుంబానికి కేటీఆర్ భరోసా

03



# కేసీఆర్ వెర్సస్ జగన్!

నాలుగున్నర దశాబ్దాల అనుభవంతో మళ్లీ యాక్టివ్ అయిన కేసీఆర్ వ్యూహాలు


వ్యూహాల్లో కేసీఆర్ మార్క్ వైసీపీకి దొరకని దారి!


**ఓటమి నుంచి గెలుపు దిశగా బీఆర్ఎస్ గేమ్ చేంజ్ ప్లాన్**

- టీ జీవన్ రెడ్డి ఎంట్రీతో బీఆర్ఎస్‌కు కొత్త జోష్
- 2028 ఎన్నికలపై కేసీఆర్ స్పెషల్ ఫోకస్
- కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూ బీఆర్ఎస్ ఆకర్షణ రాజకీయాలు
- తెలంగాణాలో బీఆర్ఎస్ దూకుడు
- ఏపీలో వైసీపీ ఎందుకు నిశ్శబ్దం?
- ప్రత్యర్థి పార్టీల నుంచి నేతల రాకే విజయానికి కీ ఫ్యాక్టర్
- కూటమి ఐక్యత వైసీపీకి పెద్ద అడ్డంకిగా మారిందా?
- బీఆర్ఎస్ స్ట్రాటజీని ఫాలో అవ్వలేకపోతున్న వైసీపీ
- రాజకీయాల్లో ఆకర్షణ శక్తే గెలుపు మంత్రం
- మారాల్సిన వైసీపీ వ్యూహం

**ముద్ర డెస్క్ :** కేసీఆర్ రాజకీయ అనుభవం దాదాపుగా నాలుగున్నర దశాబ్దాలు. ఆయన 1983లో టీడీపీ నుంచి తొలిసారి సిద్దిపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిని అందుకున్నా 1985లో గెలిచి నిలిచారు. అలా తన మార్క్‌ను చాటుకుంటూ ఈ రోజున తెలంగాణా సాధకుడిగా మాజీ సీఎం గా వ్యూహకర్తగా అపర చాణక్యుడిగా ఉన్నారు. ఇక పడినా కూడా కడలి తరంగం మాదిరిగా లేస్తేనే సిసలైన రాజకీయం. అంతే కాదు పోయిన చోటనే వెతుక్కోవాలి అన్నది అక్కడ నీతి. ఈ విషయాలు అన్నీ కేసీఆర్ కి పూర్తిగా తెలుసు. అందుకే ఆయన తనదైన వ్యూహాలను అమలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ని సంసిద్ధం చేస్తున్నారు. రేపటి ఎన్నికల్లో గెలిచే పార్టీగా జనం భావించేలా రాజకీయ జనం ఇటు వైపు చూసేలా ఏమి చేయాలో అన్నీ చేస్తున్నారు.

సుధీర్ఘమైన రాజకీయ అనుభవం ఉన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డిని తన పార్టీలో చేర్చుకోవడం ద్వారా బీఆర్ఎస్ ని గేమ్ చేంజర్‌గా మార్చేందుకు కేసీఆర్ చూస్తున్నారు. ఓటమి అన్నది నిన్నటి మాట. బీఆర్ఎస్ తోనే గెలుపు అన్నది రేపటి మాట అన్న సందేశం తెలంగాణా రాజకీయాల్లో గట్టిగా చేరేలా కేసీఆర్ అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే ఊపులో మరింత మందిని తమ పార్టీలో చేర్చుకోవాలని ఎత్తుగడలు వేస్తున్నారు. అధికార కాంగ్రెస్ మీదనే గురి పెట్టారు అని అంటున్నారు. రానున్న రోజులలో అనుకున్న తీరున వచ్చే మిగతా 02లో




# తొలకరి పులకింత

**ముందుగానే నైరుతి**

- మే నెలలోనే వచ్చేస్తున్నాయి..
- గుడ్‌న్యూస్ చెప్పిన ఐఎండీ
- ఈసారి ముందుగానే రుతుపవనాలు
- మే 14 -16 తేదీల్లో అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశం

**ముద్ర డెస్క్:** ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వేసవి ఎండలు మండిపోతున్నాయి. రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో అత్యధికంగా 45డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రతకు బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్న పరిస్థితులు. అయితే, ప్రస్తుతం మేలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వార్తలు వస్తున్నాయి. ఇదే సమయంలో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుభవార్త చెప్పింది. నైరుతి రుతుపవనాలు ఈసారి ముందుగానే వచ్చే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈనెల 14నుంచి 16తేదీల మధ్య ఇవి అండమాన్ నికోబార్ దీవులను తాకొచ్చని పేర్కొంది. ఆ తరువాత కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల గుండా విస్తరించనున్నట్లు పేర్కొంది. మిగతా 02లో

## ఆపరేషన్ క్యూబా!

02

- ట్రంప్ సంచలన ప్రకటన..
- ప్రపంచ వేదికపై మరో యుద్ధ మేఘం!
- అగ్రరాజ్యం వర్సెస్ ఐలాండ్ నేషన్
- క్యూబాపై సైనిక చర్యకు సిద్ధమన్న ట్రంప్
- ట్రంప్ హెచ్చరికతో దద్దరిల్లిన అంతర్జాతీయ రాజకీయాలు
- ఇరాన్ తర్వాత లక్ష్యం క్యూబాయేనా?



# తెలంగాణ జోరు..

**జీఎస్టీ వృద్ధిలో దేశంలోనే రెండో స్థానం**

- పెద్ద ఎత్తున జీఎస్టీ రాబడి
- దేశ ఆర్థిక పటంలో చరిత్రాత్మక ఘట్టం
- ఏప్రిల్ నెలలో 8.7 శాతం వృద్ధి నమోదు
- తెలంగాణలో ₹4621కోట్లు..
- ఏపీలో రూ.5,543 కోట్ల వసూళ్లు




**ముద్ర డెస్క్ :** తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. దేశవ్యాప్తంగా వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వృద్ధి రేటులో తెలంగాణ అద్భుత ప్రదర్శన కనబరుస్తూ జాతీయ స్థాయిలో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ జాబితాలో కర్ణాటక మొదటి స్థానంలో నిలవగా, తెలంగాణ తన ఆదాయ వనరులను సమర్థవంతంగా పెంచుకుంటూ రికార్డు స్థాయి వసూళ్లను సాధించింది.

**రికార్డు బ్రేకింగ్ వసూళ్లు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో వాణిజ్య పన్నుల శాఖ అనూహ్యమైన పనితీరును కనబరిచింది. గతేడాది (ఏప్రిల్ 2025) జీ ఎస్టీ రాబడి రూ.3,433 కోట్లుగా ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో అది ఏకంగా రూ.4,621 కోట్లకు చేరుకుంది. అంటే గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.1,188 కోట్లు అదనంగా రాబడి లభించింది. ఇది సుమారు 35 శాతం వృద్ధిని సూచిస్తోందని ఆర్థిక శాఖ అధికారులు వెల్లడించారు. జీఎస్టీ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఒకే నెలలో ఇంత భారీ స్థాయిలో ఆదాయం రావడం ఇదే మొదటి సారి కావడం విశేషం. మిగతా 02లో

**ఇదీ AI ముద్ర**



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 03.05.2026
www.mudranews.in | @mudranews



**ఇడ్లీ & సాంబార్**



ఆవిరిలో వండినందు వల్ల తక్కువ కొవ్వు, సులభంగా జీర్ణమవుతుంది. ప్రోటీన్, కార్బోహైడ్రేట్స్ మంచి సమతుల్యం.

## విద్య వైద్యం ఫ్రీగా ఇవ్వకుంటే
# రాళ్లతో కొట్టండి



(మొదటి పేజీ తరువాయి)
నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్ట్ లు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానాలు చెప్పారు. తన తండ్రి కేసీఆర్ తో తనకు పంచాయితీ లేదని బీఆర్ఎస్ అధ్యక్షుడిగానే ఆయనను విమర్శించానని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చిన సరే తెలంగాణ ప్రజల కోసం తాను ముందుకే వెళ్తానన్నారు. తన టార్గెట్ సర్వోదయ తెలంగాణ సాధించటమేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు ఎవరైతే విలనో.. తనకు కూడా వాళ్లే విలన్ అని చెప్పారు. కేసీఆర్ ను రాజకీయ నేతగానే విమర్శించానని తండ్రిగా ఆయనతో ఎలాంటి సమస్య లేదని చెప్పారు.

**రాళ్లతో కొట్టండి**
తెలంగాణ రక్షణ సేన ప్రకటించిన పాంచజన్యంలోని ఐదు అంశాలు, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల విషయంలో తాను ఇచ్చిన మాట తప్పితే అమరవీరుల స్తూపం వద్ద స్తంభానికి కట్టేసి కొట్టాలని కల్వకుంట్ల కవిత తెలిపారు. అన్ని విషయాల్లో సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాతే హామీలు ఇచ్చానని చెప్పారు. గత 20 ఏళ్లుగా తనను చూస్తున్నారని ఇచ్చిన మాట, పట్టిన తోవను విడవకుండా ఉన్నానని అన్నారు. తెలంగాణలో విద్య, వైద్యం కోసమే ప్రజలు 60 శాతం డబ్బు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కచ్చితంగా సంకల్పం తీసుకుంటే ఇది సాధ్యమేనని చెప్పారు. ఆరోగ్య శ్రీ ప్రారంభినప్పుడు, విద్యార్థులకు ఫ్రీ మీల్స్ పెట్టినప్పుడు కూడా ఇది సాధ్యమా అంటూ చాలా ప్రశ్నలు వచ్చాయన్నారు. కానీ ఇప్పుడు వాటిని అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పాంచజన్యంలోని ఐదు అంశాలను అమలు చేయటంపై ఆర్థిక నిపుణులతో చర్చలు జరిపానని కవిత చెప్పారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో లక్ష కోట్ల రూపాయలను తమ ప్రాధాన్యత అంశాలకు ఖర్చు చేయవచ్చన్నారు. ఆ విధంగా చూస్తే చేయాలన్న సంకల్పం ఉంటే చాలు ఇదంతా సాధ్యమేనని స్పష్టం చేశారు. తల్లిలా తాను పరిణితి చెందుతానంటే చాలా మంది విమర్శలు చేశారని కవిత గుర్తు చేశారు. కానీ తల్లి మాదిరి లాలన లేని కారణంగానే ఇవ్వాళ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక తల్లి మాదిరిగా ఆలోచిస్తే మాత్రమే ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పం వస్తుందన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వానికి అది చేతకావటం లేదన్నారు. వెయ్యి రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక తల్లి మాదిరి పాలన చేస్తామన్నారు.

**రాజకీయ నేత కేసీఆర్ పైనే నా విమర్శలు**
ఇటీవల కేసీఆర్ పై కవిత చేసిన విమర్శలపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు ఆమె స్పష్టంగా సమాధానం ఇచ్చారు. తన విమర్శలు కేవలం బీఆర్ఎస్ అధినేత, రాజకీయ నేత అయిన కేసీఆర్ పైనేనని చెప్పారు. తండ్రిగా ఆయనతో తనకు ఎలాంటి సమస్య లేదన్నారు. సిద్ధాంతపరమైన విబేధాలతోనే విమర్శలు చేశానని.. రాజకీయ తప్పులపై భవిష్యత్ లోనూ విమర్శలు చేస్తానని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎంతో చేయాల్సి ఉన్నప్పటికీ కేసీఆర్ అది చేయలేకపోయారన్నారు. కృష్ణా, గోదావరి నీళ్లను సరిగా వాడుకొని ఉంటే రైతుల చేతిలో రెండున్నర లక్షల కోట్లు ఉండేవని చెప్పారు. లక్షా 21 వేల కోట్లు కాళేశ్వరం, పాలమూరు కోసం ఖర్చు చేసి కేవలం లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చే క్రమంలో పెట్టిన పరీక్షల్లో పదిసార్లు పేపర్ లీక్ అవటాన్ని ప్రస్తావించారు. కేటీఆర్ లాంటి తెలివైన ఐటీ మినిస్టర్ ఉండగా ఎందుకు పేపర్ లీకైందంటూ ప్రశ్నించారు. కేసీఆర్ చర్యల కారణంగా రెండు జనరేషన్లు నష్టపోయారన్నారు. లాస్ట్ ఆపర్చునిటీ కాస్ట్ అనే విషయంలో కేసీఆర్ చేసిన తప్పులను మాత్రమే ప్రశ్నించానని స్పష్టం చేశారు.

**వ్యూహం పాటించాం**
తెలంగాణ రాష్ట్ర సేన అని ముందు ప్రకటించిన తర్వాత తెలంగాణ రక్షణ సేన గా పేరు మార్చుకోవటాన్ని జర్నలిస్టులు ప్రశ్నించారు. ఐతే తమ పార్టీ పేరు విషయంలో చాలా కుట్రలు జరిగాయని కవిత చెప్పారు. వాటిని గమనించిన తర్వాతే పార్టీ పేరు విషయంలో వ్యూహత్మకంగా వ్యవహరించామని అన్నారు. కావాలనే రకరకాల పేర్లను ప్రచారంలోకి తెచ్చామని చెప్పారు. ఐతే టీఆర్ఎస్ అనే పేరు రావటం మాత్రం సంతోషంగా ఉందన్నారు. టీఆర్ఎస్ తనకు రాసిపెట్టి ఉండటం దైవ సంకల్పమేనని భావిస్తున్నానన్నారు. టీఆర్ఎస్ ఏర్పడిన కొత్తలో కూడ బస్సు, నాగలి గుర్తు అంటూ చాలా గందరగోళం జరిగిందని చెప్పారు. పార్టీ ఏర్పాటు చేసే క్రమంలో సాంకేతిక అంశాలు చాలా ఉంటాయన్నారు. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు.

**విమర్శించే వాళ్లను పట్టించుకోం**
కవిత పార్టీ ఏర్పాటును కాంగ్రెస్, బీజేపీ, సహా కేటీఆర్ తక్కువ చేసి మాట్లాడటంపై కవిత స్పందించారు. బీజేపీ నేతలు ముందు తెలంగాణకు మేలు చేసే పని చేయాలని సూచించారు. ఈ నెల 10న రాష్ట్రానికి వస్తున్న మోడీని అడిగి పాలమూరు ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా తేవాలని, తెలంగాణకు ప్రత్యేకంగా నిధులు తేవాలని చెప్పారు. అది చేయకుండా తనను విమర్శిస్తే ఏమొస్తుందని ప్రశ్నించారు. సామాజిక న్యాయానికి బద్ధ విరోధి అయిన బీజేపీ, తెలంగాణకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీలు మాట్లాడే మాటలు పట్టించుకోనని చెప్పారు. ప్రజలకు మంచి చేసేందుకు పార్టీ పెట్టే ప్రయత్నం చేసేప్పుడు ఇలాంటి చాలా మాటలే వస్తాయన్నారు. అసలు ప్రజాస్వామ్యంలో పార్టీ ఉండటమే పవర్ అని చెప్పారు. పార్టీ అధికారంలోకి వస్తుందా లేదా అన్నది ఆ పార్టీ నడిపే వ్యక్తి సిన్సియారిటీని బట్టి ఉంటుందన్నారు. ఒక పార్టీ గురించి తక్కువ చేసి మాట్లాడుతున్న వాళ్లు వారి మాటలను ప్రజలు గమనిస్తారని గుర్తుంచుకోవాలని కేటీఆర్ ను ఉద్దేశించి వ్యాఖ్యనించారు. టీఆర్ఎస్ పెట్టినప్పుడు జెండా మోసే వాళ్లు కూడా లేరన్నారు. చిన్న పార్టీగా మొదలై వటవృక్షంలా టీడీపీ, బీఆర్ఎస్ లు ఎదిగాయని గుర్తుచేశారు. ఎవరెన్ని విమర్శలు చేసిన దాన్ని మేము మనసు మీదకు తీసుకోమని చెప్పారు. తెలంగాణ ప్రజల సమస్యలపై పోరాటమే తమ లక్ష్యమని చెప్పారు.

**నాకు వాళ్లే విలన్**
తన టార్గెట్ సర్వోదయ తెలంగాణ అని కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తనకు టార్గెట్ కాదన్నారు. తెలంగాణకు ఎవరు విలన్ ఉంటే తనకు వాళ్లే విలన్ అని చెప్పారు. తన పర్సనల్ అజెండాను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లనని స్పష్టం చేశారు. తాను ఎన్నో కష్టాలు పడ్డానని చెప్పారు. పర్సనల్ కష్టాలు, రాజకీయ కష్టాలు ఉన్నాయన్నారు. రాజకీయ కష్టాలను మాత్రమే ప్రజలకు చెబుతానని అన్నారు. తన వెనుక ఎవరు లేరని మరోసారి తేల్చిచెప్పారు. నిప్పుల నుంచి నడిచి వచ్చిన తనకు ప్రపంచాన్ని ఎదుర్కొనే శక్తి ఉందని తేల్చిచెప్పారు. ఎవరో తన వెనుక ఉండాల్సిన అవసరం లేదన్నారు. తన వెనుక తానే ఉన్నానని కవిత స్పష్టం చేశారు.


**పురుషుల కన్నా గొప్పగా నడుపుతాం**
తమ పార్టీని పురుషులు నడిపే పార్టీ కన్నా గొప్పగా నడుపుతామని కవిత చెప్పారు. దేశంలో ఎంతో మంది మహిళలు సమర్థవంతంగా పరిపాలించారని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో పార్టీని నడుపుతామన్నారు. తమ పార్టీలో కచ్చితంగా మహిళలకు ప్రాధాన్యం ఉంటుందని కవిత చెప్పారు. మహిళ బిల్లు పాసైన కాకపోయిన సరే తాము మాత్రం 33 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేసే ముందు కనీసం వివరణ అడగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంటోన్న రోహిత్ రెడ్డికి మాత్రం షోకాజ్ నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజా క్షేత్రంలో ఉండాలని భావించే తనకు బీజేపీ డీఎన్ఏతో సరిపోలదన్నారు. తెలంగాణకు అన్యాయం చేసేందే కాంగ్రెస్ అని చెప్పారు. అలాంటి పార్టీల్లో ఉండలేనని చెప్పారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయ్యాక ప్రజల మధ్యలో ఉండాలనే ఉద్దేశంతోనే పార్టీ పెట్టానని స్పష్టం చేశారు. అభివృద్ధి, సామాజిక న్యాయం జోడెద్దులుగా తాము ముందుకు వెళ్తామన్నారు.

**అన్ని రాష్ట్రాలకు ఈక్వల్ పవర్ ఉండాలి**
తమ పార్టీ భావసారూప్యం గల పార్టీలతో ప్రీ పోల్స్ అలయెన్స్ పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తే అందుకు సిద్ధంగా ఉందన్నారు. ఐతే భావసారూప్యం లేని వారితో మాత్రం పొత్తులు పెట్టుకునేది లేదన్నారు. పోస్ట్ పోల్ అలయెన్స్ అవసరం ఉంటుందని భావించటం లేదన్నారు. తెలంగాణ ప్రజలకు తమకు పూర్తి స్థాయిలో మెజార్టీ ఇస్తారని భావిస్తున్నానని కవిత చెప్పారు. ప్రస్తుతం తమ దృష్టి అంత కూడా తెలంగాణ రాజకీయాలపైనే ఉందన్నారు. జాతీయ అంశాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే స్పందిస్తామని చెప్పారు. డీలిమిటేషన్ విషయంలో తమకు స్పష్టమైన వైఖరి ఉందని చెప్పారు. అమెరికాలో సెనెట్ కు ఉన్న పవర్స్ మాదిరిగా రాష్ట్రాలకు పవర్ ఇవ్వాలన్నారు. అన్ని రాష్ట్రాలకు ఈక్వల్ ఓటింగ్ రైట్స్ ఉండాలన్నారు. ఈ విషయంలో డీటెయిల్ గా ప్రధాని మోడీకి లేఖను కూడా పంపుతున్నట్లు చెప్పారు.

**మాజీ మావోయిస్టులు పార్టీల్లో చేరాలి**
సొంత ప్రజలను డెడ్ లైన్ పెట్టి చంపుతున్నది కేంద్ర ప్రభుత్వమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం చేపట్టిన దుర్మార్గాన్ని ముందుగా ఖండించింది తనేనని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులు ఏదో ఒక పార్టీలో చేరాలని కోరారు. తెలంగాణ రక్షణ సేన వారికి స్వాగతం పలుకుతుందన్నారు. ఇష్యూ బేస్డ్ గా పాదయాత్ర చేస్తామని చెప్పారు. జర్నలిస్టులు, మైనార్టీలు, బీసీ అన్ని వర్గాలకు పోరాటం చేస్తామని కవిత చెప్పారు.

**ప్రజలు కొత్తదనాన్ని ఆదరిస్తారు**
ప్రజల కోసం ముందుకు వస్తున్న తమకు కచ్చితంగా ప్రజల ఆదరణ ఉంటుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. ఐతే తన నడవడిక, ఆచరణ చూశాక ప్రజలు తనను నమ్ముతారని తెలుసన్నారు. ఐతే గతంలో కొత్తదనాన్ని ఆహ్వానించిన చరిత్ర ఈ నేలకు ఉందన్నారు. కచ్చితంగా తమను కూడా ప్రజలు ఆదరిస్తారని నమ్మకం ఉందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక పాంచజన్యం పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్ట్ సుధాకర్ రెడ్డి మోడరేటర్ గా వ్యవహరించగా టీయూడబ్ల్యూజే అధ్యక్ష కార్యదర్శులు విరహత్ అలీ, రాం నారాయణ పాల్గొన్నారు.





# కేసీఆర్ వెర్సస్ జగన్!

(మొదటి పేజీ తరువాయి)
వారు కూడా ఉన్నారని అంటున్నారు. ఆ విధంగా బీఆర్ఎస్ అయితే 2028 ఎన్నికలకు అవసరమైన రాజకీయ వ్యూహాలతో ముందుకు సాగుతోంది. బీఆర్ఎస్ ని ఒక రాజకీయ ఆకర్షణ శక్తిగా కూడా మార్చుతున్నారు.
ఇక ఏపీలో కూడా అచ్చం బీఆర్ఎస్ మాదిరిగానే వైసీపీ చతికిలపడింది. ఆ పార్టీ కోలుకుంది అనేందుకు పార్టీ నేతలు చెబుతున్న మాటలు చేస్తున్న ప్రకటనలు ఎంత మాత్రం సరిపోవు. ఇతర పార్టీల నుంచి నేతలు వచ్చి చేరితేనే వైసీపీకి మంచి రోజులు వస్తున్నట్లుగా లెక్క అని అంటున్నారు. మరీ ముఖ్యంగా అధికార కూటమి వైపు నుంచి నేతలు వచ్చి చేరితే వైసీపీకి ఒక సానుకూలత వస్తుందని రేపటి ఎన్నికల్లో వైసీపీ నిలిచి గెలుస్తుందన్న టాక్ కూడా వస్తుందని అంటున్నారు. అయితే రెండేళ్ళు పూర్తి అవుతున్నా కూటమి కసికందకుండా ఉంది. మూడు పార్టీలు ముచ్చటగా కలిసి ఉంటున్నాయి. ఐక్యతకు మారుపేరుగా మనుగడ సాగిస్తున్నాయి.
రాజకీయాల్లో సక్సెస్ కొట్టాలంటే ఎదుటి పక్షం వికెట్లు పడాలి. వాటిని తీసేందుకు ప్రతిపక్షం అను క్షణం ప్రయత్నం చేయాలి. ఇదే రాజనీతి. తమకు జనాలు అవసరం లేదు, కావాల్సినంత మంది ఉన్నారు అనుకోవడం వేరు. ఎదుటి పక్షం నుంచి అందునా అధికారం వైపు నుంచి తమ వైపునకు తీసుకోగలిగితే సూదంటు రాయిగా ఆకర్షించగలిగితే అది కచ్చితంగా వర్కౌట్ అవుతుంది. జనం చూపు ఆలోచనలు కూడా మారుతాయి. కానీ వైసీపీ నుంచి ఈ రోజుకీ వెళ్ళాలనుకునే వారే కనిపిస్తున్నారు అని అంటున్నారు. కానీ కూటమి వైపు నుంచి ఎవరూ వచ్చేది కనిపించడం లేదని కూడా చర్చ ఉంది. బీఆర్ఎస్ తెలంగాణాలో చేస్తున్నది ఏపీలో వైసీపీ ఎందుకు చేయలేకపోతోంది అన్నది పెద్ద ప్రశ్న. తెలంగాణాలో బీఆర్ఎస్ కి పోటీగా బీజేపీ ఉంది. ఏపీలో అయితే మరో పార్టీ ప్రతిపక్షంలో వైసీపీకి లేనే లేదు. పైగా కూటమి కిక్కిరిసిపోయి ఉంది. అయినా ఆ వైపు వారిని ఈ వైపుగా ఆకట్టుకోవడం లేదంటే కూటమి సేఫ్ జోన్ అన్నది రాజకీయ జీవులకు అర్థం అయి ఉండాలి. వైసీపీ ఇంకా కోలుకోలేదు అన్న భావన కూడా ఉండి ఉండాలి. మరి దానిని పోగొట్టుకోవాలి అంటే వైసీపీ ఏమి చేయాలన్నదే ఆలోచించాలని అంటున్నారు.

# తొలకరి పులకింత

(మొదటి పేజీ తరువాయి)
ఇది సాధారణ సమయం కంటే కొంచెం ముందే కావడం గమనార్హం. దీంతో మేలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో మే నెలలో చివరి రెండు వారాల్లో ఎండల తీవ్రత తగ్గే అవ కాశం ఉంది. నైరుతి రుతుపవనాల కారణంగా దక్షిణ రాష్ట్రాలు, పశ్చి మ భారతంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈశాన్య రా ష్ట్రాలు, తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. అయితే, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో పగటిపూట మాత్రమే కాదు.. రాత్రి సమయాల్లోనూ వేడి ఎక్కు వగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. సముద్రపు తేమతో కూడిన వేడిగాలి వల్ల ఎక్కువ ఉక్కపోత ఉండొచ్చని తెలిపింది.

# తెలంగాణ జోరు..

(మొదటి పేజీ తరువాయి)
వివిధ విభాగాల ఆదాయ వివరాలు రాష్ట్రంలో నమోదైన పన్ను చెల్లింపుదారుల నుండి వసూలు చేసిన ఐజీఎస్టీ , సీజీఎస్టీ, ఎస్టీఎస్టీ ఆదాయం కలిపి మొత్తం రూ.7,181 కోట్లుగా నమోదైంది.
సీజీఎస్టీ (CGST): రూ.2,092 కోట్లు.
ఎస్టీఎస్టీ (SGST): రూ.2,527కోట్లు.
ఐజీఎస్టీ (IGST): రూ.2,562కోట్లు.
మొత్తం వృద్ధి గతేడాదితో పోలిస్తే ఈ విభాగాల్లో 12.6 శాతం వృద్ధి నమోదైంది.
ముఖ్యంగా దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. దిగుమతులపై వచ్చే స్థూల ఆదాయం 25.8శాతం పెరిగి రూ.57,580 కోట్లకు చేరుకుంది. రిఫండ్లను మినహాయించిన తర్వాత నికర జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

**రిఫండ్ల పంపిణీలోనూ వేగం**
ప్రభుత్వం కేవలం పన్ను వసూళ్లపైనే కాకుండా, వ్యాపారులకు చెల్లించాల్సిన రిఫండ్ల విషయంలోనూ అంతే వేగంగా స్పందించింది. ఈ నెలలో రిఫండ్ల పంపిణీ ఏకంగా 19.3 శాతం పెరిగి రూ.31,793 కోట్లకు చేరింది. పన్ను చెల్లింపుదారులకు సకాలంలో రీఫండ్లు అందజేయడం వల్ల వ్యాపార వర్గాల్లో నమ్మకం పెరగడమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకుంటాయని భావిస్తున్నారు.

**జనవరి నుంచి నిలకడైన వృద్ధి**
తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ జనవరి, 2026 నుంచి వరుసగా తన పాత రికార్డులను అధిగమిస్తూ వస్తోంది. మార్చి, 2026లో రూ.4,231 కోట్ల రాబడి రాగా, ఏప్రిల్‌లో ఆ సంఖ్య రూ.4,621 కోట్లకు చేరడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు నిదర్శనం. గడిచిన పూర్తి ఆర్థిక సంవత్సరం (2025-26) పరిశీలిస్తే, దేశీయంగా స్థూల జీఎస్టీ ఆదాయం 8.3 శాతం పెరిగి రూ.22.27 లక్షల కోట్లకు చేరింది.
ఆర్థిక క్రమశిక్షణ, పన్ను ఎగవేతదారులపై నిఘా, డిజిటల్ చెల్లింపులు పెరగడం వల్ల తెలంగాణ రాష్ట్రం ఈ ఘనతను సాధించగలిగిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఆదాయం పెరుగుదల వల్ల రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలుకు మరింత ఊతం లభించనుంది.

# నివేదిక ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) నివేదికను తక్షణమే అందించాలని అధికారుల కమిటీని ఆదేశించినట్లు సీఎం శ్రేవంత్ రెడ్డి వెల్లడించారు. నివేదిక ఆధారంగా పీఆర్సీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. వచ్చే వంద రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ. 6 వేల కోట్లు చెల్లించనున్నట్టు తెలిపారు. నిధుల ఖర్చు ప్రాధాన్యతలను నిర్ణయించాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై ఉందన్నారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ, తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నాయకులు సీఎంను శనివారం జూబ్లీహిల్స్ లోని అయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాలుగు కీలకమైన అంశాలపై ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలకు స్పష్టతనిచ్చారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. వంద రోజుల్లో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బెనిఫిట్స్ కోసం రూ. 6 వేల కోట్లు చెల్లించడంతో పాటు పీఆర్సీపై నివేదిక అందగానే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు.

# ఆపరేషన్ క్యూబా!

**ముద్ర డెస్క్ :**
ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ యవనికపై డొనాల్డ్ ట్రంప్ మరోసారి పెను సంచలనం సృష్టించారు. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా ఉన్న ఆయన, క్యూబాపై సైనిక చర్యకు సిద్ధమవుతున్నట్లు చేసిన ప్రకటన ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇప్పటికే పశ్చిమాసియాలో ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ట్రంప్ వ్యూహాత్మక దిశను క్యూబా వైపు మళ్లించడం అంతర్జాతీయ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా మారుతోంది.

**ఆపరేషన్ క్యూబా.. ట్రంప్ సంచలన ప్రకటన**
ఫ్లోరిడాలో నిర్వహించిన ఒక భారీ బహిరంగ సభలో ట్రంప్ తన ఉద్దేశాలను కుండబద్దలు కొట్టినట్లు వివరించారు. "ఆపరేషన్ క్యూబా" అనే పేరుతో ఒక ప్రత్యేక మిషన్‌ను ప్రారంభించబోతున్నామని, ఇందుకు అమెరికా సైన్యం సర్వం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. "ఇరాన్ సరిహద్దుల నుండి ఉపసంహరించుకుంటున్న మా సైన్యం.. తిరిగి వచ్చే క్రమంలోనే ఈ మిషన్‌ను పూర్తి చేస్తుంది. అవసరమైతే క్యూబాను తక్షణమే స్వాధీనం చేసుకుంటాం. ఇది కేవలం మాటలు కాదు.. ఒక స్పష్టమైన హెచ్చరిక" అని ట్రంప్ స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా అమెరికా నౌకాదళానికి చెందిన అత్యాధునిక యుద్ధ నౌకలను క్యూబా తీరానికి సమీపంలో మోహరించాలని ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకునేలా చేస్తోంది.




**మారుతున్న సమీకరణాలు**
అమెరికా-క్యూబా సంబంధాలు దశాబ్దాలుగా ఉప్పు-నిప్పులానే ఉన్నాయి. 1959లో ఫిడెల్ కాస్ట్రో నేతృత్వంలో జరిగిన విప్లవం తర్వాత క్యూబా అవలంబించిన కమ్యూనిస్టు విధానాలు అమెరికాకు కంటగింపుగా మారాయి. సోవియట్ యూనియన్‌తో క్యూబా పెంచుకున్న సాన్నిహిత్యం శీతల యుద్ధ కాలంలో పెను ప్రమాదానికి దారితీసింది. ఒబామా హయాంలో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు మెరుగుపడి దశాబ్దాల నాటి వాణిజ్య ఆంక్షలు కొంత వరకు సడలించబడ్డాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ 'శాంతి ఒప్పందాల'ను పక్కనపెట్టి క్యూబాను మళ్లీ ఒంటరిని చేసే ప్రయత్నం మొదలుపెట్టారు. గతంలో వెనిజులా సంక్షోభం సమయంలోనే 'క్యూబా నెక్స్ట్' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కార్యరూపం దాల్చుతున్నట్లు కనిపిస్తోంది.

**క్యూబా ప్రతిస్పందన.. లొంగే ప్రసక్తే లేదు!**
ట్రంప్ హెచ్చరికలపై క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డయాజ్-కానెల్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అమెరికా ఆధిపత్య ధోరణిని ఆయన ఎండగట్టారు. "క్యూబా ఒక సార్వభౌమత్వ దేశం. మా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకునే హక్కు ఏ దేశానికీ లేదు. నేను లొంగిపోను, రాజీనామా చేయను. మా దేశ భవిష్యత్తును మా ప్రజలే నిర్ణయిస్తారు తప్ప వాషింగ్టన్ కాదు" అని ఆయన ఘాటుగా స్పందించారు. ప్రస్తుతం క్యూబా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. చమురు కొరత, నిత్యావసరాల ధరల పెరుగుదల, ఔషధాల కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో ఈ సైనిక ముప్పు దేశాన్ని మరింత అంధకారంలోకి నెట్టే ప్రమాదం ఉంది.

**ప్రపంచం చూపు ఎటువైపు?**
ట్రంప్ చేసిన ఈ ప్రకటన కేవలం ఎన్నికల స్టంటా? లేక నిజంగానే క్యూబాపై ఆక్రమణకు అమెరికా సిద్ధమైందా? అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఒకవేళ అమెరికా గనుక సైనిక చర్యకు దిగితే, అది రష్యా , చైనా వంటి దేశాలను కూడా ఈ వివాదంలోకి లాగే అవకాశం ఉంది. ఫలితంగా మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే పరిస్థితులు ఏర్పడవచ్చని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా ట్రంప్ తీసుకున్న ఈ తాజా నిర్ణయం ప్రపంచ శాంతిని ప్రశ్నార్థకంగా మార్చింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 03.05.2026
www.mudranews.in | @mudranews





ఉప్మారవ్వతో చేసిన ఈ వంటకం ఎనర్జీ ఇస్తుంది. కూరగాయలు కలిపితే ఫైబర్ కూడా పెరుగుతుంది.

## సంక్షిప్తంగా..

### పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు పరామర్శ



**ముద్ర, హైదరాబాద్:** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌కు సర్జరీ జరగడంతో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలని సీఎం సూచించారు.

### రేవంత్, ఉత్తమ్ కేసీఆర్‌ను కాపాడుతున్నారు

**నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** కాళేశ్వరం అవినీతిలో మాజీ సీఎం కేసీఆర్ కుటుంబాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాపాడుతున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ కోవర్ట్ అని ఆరోపించారు. ఇరిగేషన్ తర్వాత అత్యంత అవినీతి జరుగుతున్నది సివిల్ సప్లయ్స్ శాఖలోనే అని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ కోవర్టులనే ఉద్యోగులుగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కంటే భారీ అవినీతి.. ఉత్తమ్ శాఖలో జరుగుతోందని ఆరోపించారు.

### మహిళా బిల్లును అడ్డుకోవడం బాధాకరం

**ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి**

**ముద్ర, నారాయణపేట:** మహిళల సాధికారతకు దోహదపడే బిల్లును రాజకీయ కారణాలతో అడ్డుకోవడం బాధాకరమని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి కేంద్రం రూ.7,823 కోట్ల పనులు చేపట్టిందని, ఈ నెల 10న ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### కేసీఆర్‌ను హింసిస్తున్నావు

**ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మరో పదేళ్ల పాటు ఆరోగ్యంగా, చురుగ్గా ఉండాల్సిన కేసీఆర్‌ను కవిత తన మాటలతో మానసికంగా బలహీనపరుస్తున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విమర్శించారు. కవిత తన రాజకీయ స్వార్థం కోసం తండ్రిని, ఇంటి సమస్యలను వీధిలోకి తీసుకురావడం సరి కాదన్నారు. కేసీఆర్ రాజకీయ ప్రస్థానం, కుటుంబ వ్యవహారాలపై కవిత చేసిన వ్యాఖ్యలపై అయన స్పందించారు. రాజకీయంగా ప్రత్యర్థులను విమర్శించడం తప్పుకాదని కానీ పదే పదే సొంత తండ్రిని టార్గెట్ చేస్తూ మాట్లాడటం తగదన్నారు. కేసీఆర్ ఒక మాస్ లీడర్ అన్నారు. ప్రజల్లోకి ఎప్పుడు రావాలో ఆయనకు బాగా తెలుసని దానం వ్యాఖ్యానించారు. సందర్భాన్ని బట్టి తప్పకుండా బయటకు వస్తారని చెప్పారు. ఈ విషయంలో కవిత అనవసర ఆందోళన వ్యక్తం చేయాల్సిన పనిలేదన్నారు. కవిత కలలు కనొచ్చు కానీ అనవసరమైన కబుర్లు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. తతబీఆర్ఎస్ నేతలకు ఈ మధ్య కాలంలో ఆందోళన ఎక్కువైందన్నారు. అందుకే ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడిన వారే ఇప్పుడు తిరిగి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ట్యాపింగ్ చేసిన వారే నీతులు చెప్తుంటే నవ్వు వస్తోందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన పునరుద్ఘాటించారు.

# ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం

**సంక్షేమ పథకాలు**
**మౌలిక సదుపాయాల కల్పన కోసమే**
**ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక**
**రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి**
**అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ముద్ర, ధర్మపురి:** రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రె 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ధర్మపురి నియోజకవర్గస్థాయి సమావేశం ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చని పథకాలను సైతం అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నడులేని విధంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నమని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సుమారు రూ.450 కోట్ల అంచనాలతో ధర్మపురిలో పుష్కర ఘాట్లు ఇతర మౌలిక సదుపాయాల కోసం అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. తొలి విడత టైర్ వన్ ద్వారా రూ.115 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు.





**ధర్మపురి టెంపుల్ మాస్టర్ ప్లాన్ అమలు**

ధర్మపురి టెంపుల్ సిటీ మాస్టర్ ప్లాన్ ఫైనల్ అయినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఎందుకు సంబంధించిన డ్రాయింగ్స్ పూర్తి కావడంతో త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధర్మపురి టెంపుల్ సిటీ మాస్టర్ ప్లాన్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు అంగవైకల్యాలు రాకుండా ఇప్పటికే పరీక్షలు నిర్వహించామని జగిత్యాల జిల్లాలో ఆర్బీ ఎస్కే ద్వారా చిన్నారులకు వైద్యం అందిస్తామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ , ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి మాట్లాడారు.

**జర్నలిస్టులకు త్వరలో ఇళ్లస్థలాలు**

**ముద్ర, ధర్మారం:** రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తు న్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామ ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఖిలావనపర్తిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ ఇటీవల క్యాబినెట్ సమావేశంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశం చర్చకు వచ్చిందని త్వరలోనే జర్నలిస్టు మిత్రులకు ఇళ్లస్థలాలు అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. కోరిన కోరికలు తీర్చే శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. 2011- 12 లో ఖిలావనపర్తి గ్రామంలో థర్మల్ పవర్ స్టేషన్ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రయత్నించగా జిల్లా పరిషత్ చైర్మన్ గా తాను అడ్డుకున్నానని మంత్రి తెలిపారు. గ్రామంలో ఒక గజం స్థలం పోకుండా కాపాడానని గుర్తు చేశారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రత్యేక రథం తయారు చేయించాలని ఇందుకు ధనవంతుగా సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో డైనింగ్ హాల్ నిర్మాణానికి ఇప్పటికే రూ. 15 లక్షలు నిధులు విడుదల చేశామని మరో రూ. 10 లక్షలు నిధులు విడుదల చేసి డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి ఏ విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# తెలంగాణలో అధికారం లక్ష్యం

**ఎంపీ ఈటల రాజేందర్**

**ముద్ర, మల్కాజిగిరి:** తెలంగాణలో అధికారాన్ని సాధించడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. మేడ్చల్ అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ సభను విజయవంతం చేయడానికి మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలు బీజేపీకి మెజారిటీ ఇచ్చి గెలిపించారని గుర్తుచేశారు. దేశానికి మరోసారి నరేంద్ర మోదీనే ప్రధాని కావాలని ప్రజలు ఓటు వేశారని తెలిపారు. గత ఎన్నికల ప్రచారాన్ని మల్కాజిగిరి నుంచే మోదీ ప్రారంభించారని, మళ్లీ ఆయన ఇక్కడికి రావడం కార్యకర్తలకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు.మల్కాజిగిరి పార్లమెంట్ పరిధి నుంచి లక్ష మందిని సభకు తీసుకువస్తామని తాను హామీ ఇచ్చానని, పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కార్యకర్తలు, ప్రజలను కోరారు. బెంగాల్ తర్వాత తెలంగాణలో కూడా బీజేపీ విజయపథంలో దూసుకుపోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో కాషాయ జెండా ఎగరడం అందరి లక్ష్యమని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నారని, ఆయన స్ఫూర్తితో మల్కాజిగిరి, సైబరాబాద్ ప్రాంతాల్లో కూడా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలంగా ఉంటే డబ్బుతో సంబంధం లేకుండా విజయం సాధ్యమవుతుందని అన్నారు.జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్ర రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడి పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మహేందర్, ఎమ్మెల్యేలు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు తాడూరి శ్రీనివాస్ తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగానే కూల్చివేతలు

**హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతల విషయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను పాటిస్తూనే ముందుకు వెళ్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లను మాత్రమే తొలగిస్తుందని, పెద్దవారిని వదిలేస్తుందని వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఈ ప్రచారంలో వాస్తవం లేదని, చట్ట ప్రకారమే చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రా పేదల మీదకు వెళ్తుంది.. పెద్దోళ్లను వదిలేస్తుందన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఇలాంటి పుకార్లను ప్రజలు నమ్మొద్దని కోరారు. బతుకమ్మ కుంటలో అసలు చెరువు లేదంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఆయన స్పందించారు. బసర్వే ఆఫ్ ఇండియా రికార్డుల ప్రకారం అక్కడ 10 ఎకరాల చెరువు ఉన్నట్లు స్పష్టంగా ఉందని వెల్లడించారు. వరదల నివారణకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు హైకోర్టు తమకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట అసలైన చెరువేనని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి శాటిలైట్ చిత్రాలు, గూగుల్ మ్యాప్స్, పాత రికార్డులను ఆధారాలుగా చూపించారు. 1975 ఇరిగేషన్ రికార్డులు, రెవెన్యూ మరియు జీహెచ్ఎంసీ పత్రాల ప్రకారం సర్వే నంబర్ 563/1లో సుమారు 9.19 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉన్నట్లు తెలిపారు.1971 సర్వే ఆఫ్ ఇండియా ఫోటోలు, 1989 నాసా ల్యాండ్‌సాట్ చిత్రాలను విడుదల చేసి చెరువు చరిత్రను వివరించారు. . చెరువులు ప్రజల సామూహిక ఆస్తులని, వాటి స్వరూపాన్ని మార్చే నిర్మాణాలు అనుమతించబోమని స్పష్టం చేశారు. నగరంలో చెరువుల పునరుద్ధరణకు చర్యలు కొనసాగుతున్నాయని, ఇప్పటికే కొన్ని ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు హైడ్రా 2093 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుందని, ఇందులో చెరువులు, నాళాలు, ప్రభుత్వ భూములు ఉన్నాయని చెప్పారు. ఈ భూముల విలువ సుమారు రూ. 85 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య , అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్, ఏసీపీలు తిరుమల్, ఉమామహేశ్వరరావు, శ్రీకాంత్ ఉన్నారు.

# ఆన్‌లైన్ యుగంలోనూ.. ఆఫ్‌లైన్ బతుకు బాధలు

**ముద్ర, సూర్యాపేట :** ప్రస్తుత ప్రపంచం అంతా డిజిటల్ వైపు పరుగులు తీస్తోంది.. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ వినోదం మన జీవితాల్లో భాగమైపోయాయి, కొన్ని కుటుంబాలు మాత్రం ఇంకా పాతకాలపు జీవన విధానంతోనే బతుకుబండి నెట్టుకొస్తూనేఉన్నాయి.. సూర్యాపేట రూరల్ మండలం రామ్లాతండా లో కనిపించిన దృశ్యం మనసును కలచివేసింది. పిల్లలతో పాటు కుటుంబసభ్యులు అందరూ కలిసి సర్కస్ విన్యాసాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోడ్డుపై తాడు మీద నడవడం, సైకిల్ చక్రాలపై ప్రమాదకర విన్యాసాలు చేయడం, చిన్న పిల్లలే ప్రాణాలను పణంగా పెట్టి ప్రదర్శనలు ఇవ్వడం చూస్తే గుండె తరుక్కుపోయింది. డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ వినోదం విస్తరించినా, ఈ వీధి కళాకారుల జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదు. రోజువారీ ఆదాయం కోసం, కుటుంబాన్ని పోషించడానికి, వారు ఇంకా ప్రాణాలతో ఆటలాడాల్సి వస్తోంది. సమాజం మారుతున్నప్పటికీ ఈ కళాకారుల



పరిస్థితి మారకపోవడం ఒక వాస్తవం. వీరికి సరైన అవకాశాలు, ప్రోత్సాహం, భద్రత కల్పిస్తే, వారి కళ కూడా నిలుస్తుంది, వారి జీవితం కూడా మెరుగవుతుంది.

### మేమున్నాం.. ఆదుకుంటాం

**ఓఆర్ఆర్ ప్రమాద కుటుంబానికి**
**కేటీఆర్ భరోసా**



**ముద్ర, డెస్క్:** శంషాబాద్ సమీపంలోని ఓఆర్ ఆర్ పై జరిగిన ప్రమాదంలో మరణించిన వారికి బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నివాళులర్పించారు. ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాలను ఆయన ఓదార్చారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఉస్మానియా ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబాలను ఓదార్చి.. మృతదేహాలను సిరిసిల్లకు తరలించేందుకు అంబులెన్స్ లు ఏర్పాటు చేశారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం తమ కుటుంబంలో తీరని లోటు మిగిల్చిందని మృతుడి బాబాయ్ కన్నీటి పర్యంతమయ్యారు. వ్యక్తిగతంగా బాధిత కుటుంబాలకు పూర్తి అండగా ఉంటానని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఈ ఘటనతో అటు సిరిసిల్ల నియోజకవర్గంలోనూ, ఇటు ఉస్మానియా ఆస్పత్రి ప్రాంగణంలో విషాద ఛాయలు అలముకున్నాయి. శంషాబాద్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ముగ్గురు చిన్నారులు సహా.. ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# ప్రజలకు అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించండి

**డీజీపీ సి.వి ఆనంద్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఔటర్ రింగ్ రోడ్డు పై ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస ప్రమాదాలపై సీఎం ఎ. రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు, శనివారం హైదరాబాద్ లో తన కార్యాలయంలో ట్రాఫిక్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వాహనాల వేగాన్ని కచ్చితంగా నియంత్రించడంతో పాటు, భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా నగరంలో వాహనదారులకు, సామాన్య ప్రజల కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.జీహెచ్ఎంసీ పరిధిలోని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్లు, డీసీపీలతో నిర్వహించిన ఈ సమావేశంలో నగరంలో నెలకొన్న ట్రాఫిక్ పరిస్థితులపై డిజిపి సివి ఆనంద్ సమీక్షించారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు సరికొత్త వ్యూహాలను అవలంబించాలని, అవసరమైన చోట పటిష్టమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం త్వరలోనే 'ట్రాఫిక్ మేనేజ్మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో'ను ఏర్పాటు చేయనుందని, బ్యూరో అతి త్వరలోనే అందుబాటులోకి వచ్చి ట్రాఫిక్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపాలని, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను , హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వారిపై చట్టం ప్రకారం వ్యవహరించాలని, నిబంధనల అమలుపై క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ చందన దీప్తితో పాటు ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెగ్డే, కాజల్ సింగ్, రాహుల్ రెడ్డి, అవినాష్ కుమార్, శేషాద్రిని రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### జీఎన్ నాయుడు పార్థివదేహానికి సీఎం చంద్రబాబు నివాళి



**ముద్ర, హైదరాబాద్:** పారిశ్రామిక వేత్త, రీజెన్సీ గ్రూప్ అధినేత జీఎన్ నాయుడు పార్థివ దేహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళులర్పించారు. హైదరాబాద్‌లో వారి నివాసానికి వెళ్లి జీఎన్ నాయుడుకు నివాళులర్పించారు. తెలుగు ప్రజలు మంచి పారిశ్రామికవేత్తను కోల్పోయారని, రీజెన్సీ స్థాపనతో యువతకు ఉపాధి కల్పనలో జీఎన్ నాయుడు కృషి ఎనలేనిదని సీఎం అన్నారు. సమాజ సేవకు జీఎన్ నాయుడు తన వంతు కృషి చేశారని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా జీఎన్ నాయుడుతో తనకు ఉన్న పరిచయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.

### వీడిన నేరేడ్ మెట్ మర్డర్ మిస్టరీ.. నిందితుడి అరెస్ట్



**ముద్ర, మల్కాజిగిరి:** నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జెకె కాలనీలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. వంటగది ప్లాట్ ఫామ్ కింద మృతదేహాన్ని దాచిన ఘటనలో నిందితుడు గవ్వల మల్లేష్ (47)ను అరెస్ట్ చేశారు. మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్, ఏసీపీ యాదగిరి రెడ్డి, నేరేడ్ మెట్ ఇన్ స్పెక్టర్ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గత ఏడాది డిసెంబర్ 15న మల్లేష్ తన పరిచయస్తుడు కంచి వెంకట్ రాములు (47)తో కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో వ్యక్తిగత విషయాలపై వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో మల్లేష్ కర్రతో దాడి చేయడంతో వెంకట్ రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య అనంతరం మృతదేహాన్ని వంటగది ప్లాట్ ఫామ్ కింద దాచిపెట్టి, ఇటుకలతో మూసివేసి నిందితుడు పరారయ్యాడు. కొన్ని నెలల తర్వాత ఇంటి యజమానికి దుర్వాసన రావడంతో తాళాలు పగులగొట్టి చూడగా కుళ్లిపోయిన మృతదేహం బయటపడింది. దీంతో ఏప్రిల్ 17న కేసు వెలుగులోకి వచ్చిం ది. టెక్నికల్ ఆధారాలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు మల్లేష్ ను మే 1న జూబ్లీ బస్ స్టాండ్ వద్ద అదుపులోకి తీసుకొని శనివారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

### నవ దంపతుల ఆత్మహత్య

**ముద్ర, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లిలోని కుమ్మరిబస్తీలో యెంజల కార్తీక్ (28), ఆయన భార్య మంజుల అలియాస్ జ్ఞాన్సిక (27) తమ నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. కార్తీక్ ఐటీసీ కంపెనీలో మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తుండగా, మంజుల గృహిణి. అనన్య హాస్పిటల్ నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

### కుషాయిగూడలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ముద్ర, కుషాయిగూడ:** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఏప్రిల్ 26న మతిస్థిమితం లేని ఆ వ్యక్తిని స్టేషన్కు తీసుకెళ్లి, అదే రోజు అబ్దుల్లాపూర్ మెట్ లోని ఆలేటి ఆశ్రమంలో చేర్పించారు. అయితే ఏప్రిల్ 30న ఆశ్రమ నిర్వాహకులు అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సంపాదకీయం

# మీడియా ఎవరి పక్షం?




సత్యం అసత్యంగా, అబద్ధం నిజంగా ప్రచారంలోకి వస్తున్నది. సమాచారాన్ని సేకరించే జర్నలిస్టు విధి అడ కత్తెరలో పోక చెక్కలా నిత్యం అభద్రతలో కొనసాగుతున్నది.అలాంటి పరిస్థితుల్లో పత్రికా స్వేచ్ఛలో ఇండియా తాజా ర్యాంకు 157. ఈ ర్యాంకు వింటే గొంతులో పచ్చి వెలక్కాయ చిక్కుకొని నోట మాట పెగలడం లేదు. నిజాలు వెలుగులోకి చూడడం మానేశాయి. పత్రికా స్వేచ్ఛపై "రిపోర్టర్స్ వితవుట్ బార్డర్స్" అనే అంతర్జాతీయ సంస్థ విడుదల చేసిన తాజా జాబితాలో ఇండియా అత్యంత ఘనమైన 157వ స్థానం పొందింది.

గత సంవత్సరంతో పోల్చితే ఈ యేడాది ఆరు ర్యాంకులు ఎగబాకి 157 స్థానానికి ఎదిగి పోయిందన్నమాట. ఈ సంస్థ 25 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఈ పనిని నిబద్ధతతోనే చేస్తూ వస్తున్నది. ర్యాంకులు ఇవ్వడంలో ఆ సంస్థ కు ఏవో ప్రయోజనాలు ఉన్నాయని అనుకోలేము. పత్రికా స్వేచ్ఛ స్థాయిని లెక్కగట్టిన మొత్తం 180 దేశాల్లో ఈ దేశ ప్రస్తుత స్థానం దిగువ నుంచి చూస్తే కేవలం 23 దేశాలు మాత్రమే ఇండియా కంటే ముందు ర్యాంకులను కొట్టివేశాయి. ఈ ర్యాంకు దినదిన ప్రవర్ధమానమై పోతూ కొన్నేళ్లలో ఆఖరి నుంచి మొదటి స్థానం అదే చివరి స్థానం180 కి చేరుకునే అవకాశాలను కూడా కొట్టి పారేయలేము. కణతపై తుపాకీ,మెడపై కత్తిమోపి బెదిరించే చోట సత్యం వెలుగు చూసే అవకాశాలు చాలా పరిమితంగా ఉండడంలో ఆశ్చర్యం ఏముంటుంది?

అందుకే ఈ దేశ మీడియా ఘనమైన ర్యాంకును పొందింది. ఒకనాడు సామాజిక సేవగా ఉన్న జర్నలిజం అతి ఖరీదైన వ్యాపారంగా మారిపోవడం,అది కార్పొరేట్ వ్యాపారుల గుప్పిట్లోకి వెళ్లిపోవడంతో సమాచారం రూపు, రంగు, రుచి, స్వభావం పూర్తిగా మారిపోయి సత్యం మరుగున పడి పోయింది. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లుగా సమాచార స్వభావం పూర్తిగా మారిపోయింది. ఫలితంగా సత్యం అసత్యంగా, అబద్ధం నిజంగా ప్రచారంలోకి వస్తున్నది. అధికారానికి అప్రియమైన కొన్ని సంఘటనలైతే అసలు ప్రచారం, ప్రసారమే కావడం లేదు. రాజకీయాలు పూర్తిగా వ్యాపార రూపును సంతరించుకోవడం వల్ల జరిగిన ఘటనలు, పరిణామాలు కొత్తగా చూపడం మొదలైంది.

కార్పొరేట్ వ్యాపారానికి అధికారానికి మధ్య ఇచ్చి పుచ్చుకున్ననే అనేక ఆర్థిక, వ్యాపార సంబంధాలు ఈ స్థితికి మూల కారణం. అధికార వ్యవస్థకు వ్యాపారుల మధ్య కొనసాగుతున్న అవసరాల బంధాలు మీడియా రాజకీయ వైఖరులను శాసించే స్థితికి పతనమై పోయాయి.అంటే మీడియా వైఖరుల (ఎడిటోరియల్ పాలసీ)ను మీడియా యాజమాన్యాలు, అధికార వ్యవస్థలు నిర్ణయించే స్థితికి వచ్చేసాయి. మీడియా చెబుతున్న అబద్ధాలు,అర్థ సత్యాలకు గాను జర్నలిస్టులనే జనం నిందిస్తున్నారు.కానీ అసలు కారణాలు వేరు. మీడియా యాజమాన్యాల వైఖరికి అనుగుణంగా మాత్రమే పని చేయక తప్పని పరిస్థితుల్లోకి ప్రస్తుత జర్నలిస్టులు నెట్టివేయబడ్డారు. అంటే ఏమిటి అర్థం? సమాచార ప్రచార, ప్రసారాల్లో జర్నలిస్టులు సేకరించిన సమాచారం యథాతథంగా వివరించే అవకాశాలు చాలా వరకు ఉండడం లేదు. అలాంటప్పుడు మీడియాలో వచ్చే వార్తలు, కథనాలకు బాధ్యులు జర్నలిస్టులు ఎంత మాత్రం కారు కదా. ఇలాంటి క్రమంలో ఈ గొప్ప ర్యాంకును పొందడంలో వింత ఏమీ లేదు. "సత్యమునే పలుకవలెను, అబద్ధం ఆడరాదు"అని చిన్ననాడు మనం బడిలో చదువుకున్న నీతి సూత్రం అపహాస్యం పాలై పోతున్నది.సత్యం యథాతథంగా చెప్పే కనీస అవకాశాలు కూడా లేని చోట అలాంటి బడి పాఠాలు చెప్పడం వ్యర్థ ప్రయాస మాత్రమే అనిపిస్తున్నది. సత్యమేవ జయతే అనే సూక్తి వెక్కిరింతకు లోనై పోతున్నది. అతి పరిమిత సంఖ్యలో మీడియా సంస్థలు ఉన్న స్థితి కాదిది.ప్రభుత్వ లెక్కల ప్రకారమే ప్రకారం దేశంలో ఇప్పుడు పత్రికల సంఖ్య లక్షకు పైగానే ఉంది. ఉపగ్రహం(సాటిలైట్)ద్వారా వార్తలను అందించే టెలివిజన్ చానెళ్లు సుమారు 500 వరకూ ఉన్నాయి. మీడియా ఇంతగా విస్తరించి పోయిన సమాజంలో సత్యం అనాథగా మారిపోవటం ఒక వింత పరిణామమే. లక్ష పత్రికలు, 500 ల అత్యాధునిక వార్తా టీవీలు ఉన్న ఈ దేశం పోటీ పడి నిజాలను సమాజానికి అందించవలసిన పరిస్థితులు ఉండాలి కదా. అయితే వీటిలో 95 శాతం నలుగురు భారతీయ కుబేరుల యాజమాన్యంలోనే ఉన్నాయి. నిజమే అవి అన్నీ పోటీ పడి వార్తలను ప్రచారం ప్రసారం చేస్తున్నాయి. కానీ నిజాలు చెప్పడంలో మాత్రం పోటీ కాదు. అధికార వ్యవస్థ ప్రాపకం పొందే ప్రయత్నంలో దానితో అవసరాలు తీర్చుకునే ప్రయత్నాల్లో విపరీతంగా పోటీ పడుతున్నాయి.

ఇదిగో పులి అంటే,అదిగో తోక అన్న చందంగా సత్యానికి అనేక ముసుగులు వేసి, రంగులు అద్ది,కల్పనలు,కథలను వాటికి చేర్చి, మేలి ముసుగు వేసిన అబద్ధాన్ని జనంలోకి తీసుకు వెళ్లే రీతిలో పోటీ పడిపోతున్నాయి. అందువల్ల ఎన్ని పత్రికలు చదివినా,ఎన్ని వార్తా టీవీలు చూసినా సత్యం తెలుసుకునే అవకాశాలు కనీస మాత్రానికి దిగజారిపోయాయి. అలాగని చెప్పి పత్రికలు చదివే వారు, టీవీలు చూసే వారి సంఖ్య ఏమీ తగ్గిపోలేదు. పత్రికలు చదువుతూనే ఉన్నారు,టీవీల్లో వచ్చే వార్తలు కథనాలు చూస్తూనే ఉన్నారు. కానీ వాటిని జనం విశ్వసిండం లేదు. జనం ఏమీ అమాయకులు కారు కదా. ఆ సమాచారాన్ని ఏ మాత్రం విశ్వసించడం లేదు. చదువుతూ, వింటూ, చూస్తూ నిజం ఏమై ఉంటుందా అనే లెక్కలు, అంచనాలను ఎవరికి వారే వేసుకుంటున్నారు. అయితే ఇక్కడ ఒక విషయం తప్పని సరిగా ప్రస్తావించాలి.

మీడియాకు ప్రధాన ముడి సరుకు అయిన సమాచార సేకరణ పాత్ర విలేకరి, జర్నలిస్టుది కదా. అబద్ధపు ప్రచారంలో ఆయన,ఆమె పాత్ర చాలా పరిమితం. వాళ్లు సేకరించిన సమాచారాన్ని పని చేసే మీడియా సంస్థ వైఖరికి అనుగుణంగా తీర్చిదిద్దాలి. అది ప్రస్తుత జర్నలిస్టు ఉద్యోగ ధర్మం.ఆ ఉద్యోగ ధర్మ నిర్వహణలో ఏ మాత్రం దారి తప్పినా మరుసటి రోజు ఆ జర్నలిస్టు నిరుద్యోగిగా మారిపోయి వీధిన పడే అవకాశాలు చాలా ఎక్కువ. ఇలాంటి స్థితిలో జనానికి నిజం చెప్పే అవకాశాలు అత్యంత కనిష్ఠ స్థాయిలో మాత్రమే ఉంటాయి. అంటే జర్నలిస్టు ఉద్యోగం అనేది ఇప్పుడు ఈ దేశంలో నిత్యం అభద్రతతో కూడుకున్న తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటి ఒక ఉద్యోగం అన్నట్లు. ఒకప్పుడు అత్యంత గౌరవనీయ వృత్తిగా ఉన్న విలేకరి ఉద్యోగం ఇప్పుడు ఆ మర్యాదను పూర్తిగా కోల్పోయింది. ఈ క్రమంలో జర్నలిస్టు ఉద్యోగం అనేది ఈ దేశంలో కత్తి మీద సాము లాంటి యుద్ధంగా మారిపోయింది. జర్నలిస్టులు పొందే వేతనం ఏమంత ఆకర్షణీయమైనది కూడా కాదు. అలాంటి జర్నలిస్టు నిత్యం అనేక బెదిరింపులు ఎదుర్కొంటున్నాడు.భౌతిక దాడులను కూడా ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఇటీవలి కాలంలో అనేక మంది హత్య గావించ బడ్డారు కూడా. న్యాయమైన వేతనం, ఉద్యోగ భద్రత ,సామాజిక భద్రత లాంటివి ఏమీ లేని జర్నలిస్టు ఉద్యోగంలో కొనసాగడం ఇప్పుడు ఈ దేశంలో ఒక సాహసమే అని చెప్పాలి. ఇలాంటి అన్ని పరిస్థితుల స్థూల సారమే 157 వ ర్యాంకు అని అర్థం చేసుకోవాలి. ఈ పరిస్థితుల్లో కూడా జనానికి నిజాలు చెప్పే వేదికలు కొన్ని కూడా ఉన్నాయి.వాటి సంఖ్య అత్యంత పరిమితమైనది. వాటి విస్తృతి కూడా పరిమితం. కేవలం నిజాలను మాత్రమే చెప్పే ప్రయత్నం చేస్తున్న కొన్నిపత్రికలు,కొన్ని టీవీలు,డిజిటల్ పత్రికలు, వెబ్ మీడియా సంస్థలు కొన్ని ఉన్నాయి. ఇలాంటి స్థితిలో నిజాలు చెప్పే ప్రయత్నం చేస్తున్న ఈ మైనారిటీ మీడియాకు ఆర్థిక వనరులు చాలా పరిమితం.ఆ పరిమితులు, పరిధుల్లోనే పనిచేస్తూ నిజాన్ని సమాజానికి చెప్పే జర్నలిజం బాధ్యతను నిర్వర్తిస్తూ అభినందనీయమైన పాత్రను ఆ వార్తా వేదికలు పోషిస్తున్నాయి.

సాంకేతికత విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన క్రమంలో సామాజిక మాధ్యమా(సోషల్ మీడియా)ల విస్తృతి విపరీతంగా పెరిగి పోయింది. ఎవరు ఏ విషయమైనా తమకు నచ్చిన రీతిలో మొత్తం ప్రపంచానికి చెప్పుకోగల అవకాశాలు ఇప్పుడు అపారంగా ఏర్పడ్డాయి. ఇలాంటి సామాజిక బాధ్యత గల వేదికల ద్వారా మీడియా చెప్పని కొన్ని నిజాలు లోకానికి తెలిసి పోతున్నాయి.ఈ అబద్ధాల ప్రపంచంలో నిజాలు తెలిసే అవకాశాలున్న వేదికలు అందుబాటులో ఉండడం సంతోషించే పరిణామమే అని చెప్పాలి.

- **గోవర్ధన్ గందె,** 9347056621.

# వైభవ్ సూర్యవంశీపై ‘చైల్డ్ లేబర్’ వివాదం..



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**


ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున అద్భుత ప్రదర్శనతో వెలుగులోకి వచ్చిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు కొత్త వివాదానికి కేంద్రబిందువయ్యాడు. బీహార్‌కు చెందిన ఈ యువ ఆటగాడు తన దూకుడు బ్యాటింగ్‌తో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటుండగా, ఓ కన్నడ సామాజిక కార్యకర్త చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ లోకి అడుగుపెట్టిన వైభవ్, ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌పై శతకం బాది అత్యంత పిన్న వయసులో సెంచరీ చేసిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. అయితే అతడి వయసును ప్రస్తావిస్తూ, ఇంత చిన్న వయసులో ప్రొఫెషనల్ క్రికెట్ ఆడించడం బాలకార్మిక చట్టాల పరిధిలోకి వస్తుందని ఆ కార్యకర్త ఆరోపించారు. అతని వాదన ప్రకారం, చిన్న వయసులోనే భారీ కాంట్రాక్టులతో ప్రొఫెషనల్ స్థాయిలో ఒత్తిడి కలిగించడం సరైంది కాదని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అయితే భారత చట్టాల ప్రకారం 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం అయినప్పటికీ, 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న వారిపై వేర్వేరు నిబంధనలు అమల్లో ఉంటాయి. ప్రమాదకర రంగాలు కాకుండా క్రీడలు వంటి విభాగాల్లో అవకాశాలు ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. బీసీసీఐ, ఐపీఎల్ నిబంధ నల ప్రకారమే వైభవ్ ఎంపికైన నేపథ్యంలో ఈ ఆరోప ణలకు ఎంత బలం ఉందన్నది చర్చగా మారింది. వివాదం పక్కన పెడితే, వైభవ్ మాత్రం బ్యాట్‌తోనే తన ప్రతిభను నిరూపిస్తున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటికే కీలక పరుగులు సాధిస్తూ రాజస్థాన్ విజయాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు. అధికారిక ఫిర్యాదు లేదా స్పందన ఇంకా వెలువడకపోయినా, ఈ అంశం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# టీ20 వరల్డ్‌కప్ కోసం భారత మహిళల జట్టు ప్రకటన..

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

2026 మహిళల టీ20 ప్రపంచకప్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శక్తివంతమైన 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఇంగ్లండ్, వేల్స్ వేదికగా జూన్ 14 నుంచి ప్రారంభమయ్యే ఈ మెగా టోర్నీలో టైటిల్ గెలవాలనే లక్ష్యంతో భారత్ బలమైన కూర్పుతో బరిలోకి దిగుతోంది.జట్టుకు అనుభవజ్ఞురాలు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన వైస్ కెప్టెన్ బాధ్యతలు చేపట్టనుంది. అనుభవం, ప్రస్తుత ఫామ్ రెండింటినీ దృష్టిలో పెట్టుకుని సెలెక్టర్లు జట్టును ఎంపిక చేసినట్లు స్పష్టమవుతోంది.బ్యాటింగ్ విభాగంలో షెఫాలి వర్మ, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ వంటి కీలక ఆటగాళ్లు జట్టుకు బలం కానున్నారు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ మరోసారి ప్రధాన అస్త్రంగా మారనుంది. గాయంతో దూరమైన అమన్జోత్ కౌర్ స్థానంలో డబ్ల్యూపీఎల్‌లో రాణించిన యువ ఆటగాళి భారతి ఫుల్‌మాలికి అవకాశం లభించింది.బౌలింగ్ విభాగంలో రేణుకా సింగ్ ఠాకూర్ పేస్ దళాన్ని నడిపించనుండగా, నందిని శర్మ ఎంపిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్పిన్ విభాగంలో రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, శ్రీ చరణి కీలక బాధ్యతలు చేపట్టనున్నారు.అనుభవజ్ఞులైన హర్లీన్ డియోల్, స్నేహ రాణాలకు చోటు లేకపోవడం ఆశ్చర్యం కలిగించినా, యువ ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా భవిష్యత్ దృష్టితో ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. స్టాండ్‌బై ప్లేయర్లకు అవకాశం ఇవ్వకుండా నేరుగా 15 మందితోనే బలమైన జట్టును ఖరారు చేశారు.ఇంగ్లండ్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సమతూకంగా ఎంపికైన ఈ జట్టుపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వన్డే ప్రపంచకప్ విజయోత్సాహాన్ని కొనసాగిస్తూ, ఇప్పుడు టీ20 కిరీటాన్ని కూడా సొంతం చేసుకోవాలని భారత మహిళల జట్టు పట్టుదలగా కనిపిస్తోంది.





# టోకెన్ స్ట్రైక్’కి దిగిన తమిళ నిర్మాతలు!

తమిళ చిత్ర పరిశ్రమలో నెలకొన్న తాజా పరిణామాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. థియేటర్ యాజమాన్యాలు ఏకపక్షంగా తీసుకున్న కొన్ని నిర్ణయాలకు వ్యతిరేకంగా ‘తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్’ మే 2వ తేదీన ఒక రోజు ‘టోకెన్ స్ట్రైక్’ (నిరసన ప్రదర్శన) కు దిగారు. సాధారణంగా సినిమా వసూళ్ల లో థియేటర్ యాజమాన్యాలకు, నిర్మాతలకు మధ్య ఒక ఒప్పందం ఉంటుంది. అయితే, ఇటీవల థియేటర్ యజమానులు ముందస్తు సమాచారం లేకుండా, అకస్మాత్తుగా ‘రెవెన్యూ షేర్’ పద్ధతిని అమలులోకి తెచ్చారు. ఈ విధానం వల్ల నిర్మాతలకు వచ్చే లాభాల్లో భారీ కోత పడుతుందని, ముఖ్యంగా చిన్న, మధ్య తరహా బడ్జెట్ చిత్రాల మనుగడ కష్టమవుతుందని నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఒక రోజు నిరసన వల్ల పరిశ్రమలో కొన్ని రంగాలు స్తంభించిపోయాయి. ఈ వారంలో విడుదల కావాల్సిన సినిమాలపై ఈ ప్రభావం పడనుంది. థియేటర్లతో సయోధ్య కుదిరే వరకు కొత్త సినిమాల విడుదలను నిలిపివేసే యోచనలో నిర్మాతలు ఉన్నారు. ఎడిటింగ్, డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ వంటి పనులు ఈ రోజు నిలిచిపోయే అవకాశం ఉంది. దీనివల్ల రాబోయే సినిమాల షెడ్యూల్స్ కొంతవరకు ఎఫెక్ట్ అయ్యే ప్రమాదం ఉంది. అయితే, రోజువారీ కూలీలపై ఆధారపడే కార్మికులను దృష్టిలో ఉంచుకుని, సినిమాల షూటింగ్‌లను మాత్రం ఆపకూడదని అసోసియేషన్ నిర్ణయించింది. ఇది ఒక సానుకూల పరిణామం. ఈ పోరాటంలో దక్షిణ భారత చలనచిత్ర కార్మికుల సమాఖ్య (FEFSI)తో పాటు ఇతర సినీ అనుబంధ సంఘాల మద్దతును కూడా ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ కోరింది. ఒకవేళ థియేటర్ యాజమాన్యాలు తమ మొండి వైఖరిని వీడకపోతే, ఈ నిరసన మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది.

## ‘టాక్సిక్’లో బోల్డ్ సీన్స్‌పై కియారా టెన్షన్?..

**ముద్ర, సినిమా డెస్క్ :** యష్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘టాక్సిక్’ విడుదలకు సిద్ధమవుతుండగా, హీరోయిన్ కియారా అద్వానీకి సంబంధించిన ఓ ఆసక్తికర వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. సినిమా ఫైనల్ కట్ చూసిన తర్వాత యష్‌తో ఉన్న కొన్ని బోల్డ్, ఇంటిమేట్ సన్నివేశాలపై కియారా ఆందోళన వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. స్క్రీన్‌పై అవి మరీ ఎక్కువగా కనిపిస్తున్నాయని భావించిన ఆమె, ఆ సీన్లను తగ్గించాలా లేదా తొలగించాలా అని చిత్రబృందాన్ని కోరినట్లు టాక్. అయితే దర్శకురాలు గీతూ మోహన్ దాస్ మాత్రం కథకు ఆ సన్నివేశాలు కీలకమనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. పెళ్లి తర్వాత ఫ్యామిలీ ఆడియన్స్‌లో తన ఇమేజ్‌ను కాపాడుకునే దిశగా కియారా మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తోందని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్తపై అధికారిక స్పష్టత లేకపోయినా, ‘టాక్సిక్’పై మాత్రం మరింత హైప్ పెరిగింది.



## బాలయ్యకు మరోసారి జోడీగా కాజల్

**ముద్ర, సినిమా డెస్క్ :** నటసింహం నందమూరి బాలకృష్ణ కెరీర్‌లో 111వ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు #NBK111పై తాజాగా ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. మొదట ఈ సినిమాలో బాలయ్య సరసన నయనతార నటించనున్నట్లు ప్రచారం జరిగినప్పటికీ, ఇప్పుడు ఆమె స్థానంలో కాజల్ అగర్వాల్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. ‘సింహా’, ‘శ్రీరామ రాజ్యం’, ‘జై సింహా’ వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత బాలకృష్ణ–నయనతార జోడీ మరోసారి తెరపై కనిపిస్తుందనే అంచనాలు అభిమానుల్లో నెలకొన్నాయి. అయితే షెడ్యూల్ సమ స్యలు, పారితోషిక అంశాలు ఈ కాంబి నేషన్‌కు బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది. ప్రస్తు తం నయనతార బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్‌తో ఓ భారీ ప్రాజెక్ట్‌లో బిజీగా ఉండటంతో ఆమె తేదీలు సర్దుబాటు చేయడం కష్టమైందని సమాచారం. అదే సమయంలో ఈ చిత్రం కోసం నయనతార భారీ స్థాయిలో రెమ్యునరేషన్ కోరినట్లు టాక్ నడుస్తోంది. ప్రమోషన్లకు దూరంగా ఉండే ఆమె విధానం కూడా నిర్మాతలను మరో ఆలోచనలో పడేసినట్లు చెబుతున్నారు. దీంతో మేకర్స్ కొత్త ఆప్షన్ కోసం వెతికి చివరకు కాజల్ అగర్వాల్‌ను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే ‘భగవంత్ కేసరి’లో బాలయ్యతో స్క్రీన్ షేర్ చేసుకున్న కాజల్, ఈసారి మాత్రం పూర్తి స్థాయి హీరోయిన్ పాత్రలో కనిపించనుందట. తక్కువ పారితోషికంతో పాటు ప్రమోషనల్ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనడానికి ఆమె అంగీకరించిందని తెలుస్తోంది. దీంతో నిర్మాతలు కూడా కాజల్ ఎంపికపై సంతృప్తిగా ఉన్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి.

**ఓట్స్**

ఫైబర్ ఎక్కువగా ఉండి హృదయానికి మంచిది. బరువు నియంత్రణకు సహాయపడుతుంది.



## తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయాలి



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** అక్షరాస్యతలో వెనుకబడిన గట్టు మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను తక్షణమే ఏర్పాటు చేయాలని గట్టు మండలం బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గట్టు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాలల హక్కుల పరిరక్షణ వేదిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ గట్టు మండలంలో మొత్తం 46 ప్రభుత్వ పాఠశాలలో ఉన్నాయని, సుమారు 9,000 మంది పిల్లలు విద్యను కొనసాగిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు తగిన సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలలు లేవని, ప్రభుత్వ ఉపాధ్యాయుల కొరత వలన పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని అన్నారు. ఎంవిఎఫ్ కోఆర్డినేటర్ ఎం. సాయికుమార్ మాట్లాడుతూ ఆడపిల్లల చదువులకు ఇబ్బంది కలగకుండా టెన్త్ క్లాస్ పాస్ అయిన విద్యార్థులు అందరిని ఇంటర్మీడియట్ లో జాయిన్ చేసే విధంగా బాలల హక్కుల పరిరక్షణ వేదిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 30 మంది సభ్యులు కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.

## 'పది'లో ప్రతిభ చాటిన కరాటే క్రీడాకారులకు సన్మానం



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** విద్యార్థులు కష్ట పడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరాటే శ్రీహరి అన్నారు. పదో తరగతి, ఇజటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కరాటే క్రీడాకారులు జితేంద్ర 585/600, సుప్రీతి 545/600 జశ్వంతి 557/600, నాగేంద్ర 514/600, ఐశ్వర్య 491/600 మార్కులు, ఇంటర్మీడియట్ ఫస్టియర్ లో సిరి మహాలక్ష్మి 457/470, అక్షయ 435/470, మార్కులు సాధించారు. శనివారం గద్వాల ఇండోర్ స్టేడియంలో వారిని ఘనంగా సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల్లో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ ఒక వరం



**ముద్ర, శేరిలింగంపల్లి:** సీఎంఆర్ఎఫ్ అనేది కేవలం ఒక నిధి కాదు... అది నిరాశలో ఉన్నవారికి ఆశ, బాధలో ఉన్నవారికి బలం అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో మంజూరైన రూ.6.10 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారుల కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏకే బాలరాజ్, రాములు గౌడ్, కనకమామిడి నరేందర్ గౌడ్, శేఖర్ ముదిరాజ్, కావూరి ప్రసాద్, పట్వారీ శశిధర్, సంజు, మోహన్ రెడ్డి, చిన్న, రాంచందర్ గౌడ్, యలమంచి ఉదయ్ కిరణ్, ముజీబ్, సుధాకర్, తిరుపతి, వెంకన్న, ప్రభాకర్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

## మే 5న దీక్ష విజయవంతం చేయాలి..




**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మే 5న నిర్వహించనున్న నిరాహార దీక్షను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో టీజీఈజేఏసీ చైర్మన్ బావండ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులకు సంబంధించిన 64 డిమాండ్ల సాధన కోసం మే 5న చేపట్టనున్న ఒకరోజు నిరాహార దీక్షకు సంబంధించి చర్చించారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ అడిషనల్ సెక్రటరీ జనరల్ సత్యనారాయణ రెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎండి షర్ఫుద్దీన్, కో–చైర్మన్లు కే. శ్రీధర్ రావు, సి.హెచ్. వెంకటప్ప, భగవేనీ నరసింహ, లక్ష్మి నరసింహారావు, వివిధ సంఘాల ప్రతినిధులు లక్ష్మీనారాయణ, గోదారాజు, రవీందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, యూనస్, మలిపెద్ది సురేష్ కుమార్, జీ.కే. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో నియోజకవర్గ స్థాయి సమావేశం

**ముద్ర, కూకట్‌పల్లి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం కూకట్‌పల్లిలోని ఎన్‌కెఎన్ఆర్ గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపు, స్థానిక సమస్యల గుర్తింపు, అభివృద్ధి ప్రాధాన్యతలపై చర్చించారు. రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పెన్షన్లు, కల్యాణలక్ష్మి వంటి పథకాల అమలుపై సమీక్షించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ మాట్లాడుతూ ప్రజల అవసరాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల మధ్య సమన్వయం పెంపుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'

### - టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి



**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం మహేశ్వరం నియోజకవర్గ స్థాయి సమావేశం కాకి ఈశ్వర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ వాటి ప్రయోజనాలు ప్రతి పౌరునికి చేరేలా చర్యలు తీసుకుంటోందన్నారు. గ్యారంటీ పథకాల అమలు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ, అర్హులైన వారికి గృహాల కల్పన వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసే చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలను ప్రజలకు చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రజలు పాల్గొన్నారు.

### సమర్థవంతంగా అమలు చేయాలి..

### - ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


**ముద్ర, మల్కాజిగిరి:** ప్రజలకు చేరువగా సేవలు అందించేందుకు రూపొందించిన 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికను అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. శనివారం ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రణాళిక అమలు పురోగతిని సంబంధిత శాఖల అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజ్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి శాఖ తనకు కేటాయించిన పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని పేర్కొన్నారు. సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆలస్యం చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో జడ్‌సి రాధికతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సమగ్ర అభివృద్ధి లక్ష్యం..


### - ఆరెకపూడి గాంధీ

**ముద్ర ప్రతినిధి:** గచ్చిబౌలిలో శేరిలింగంపల్లి నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశం శనివారం నిర్వహించారు. పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని, 99 రోజుల కార్యాచరణ ద్వారా గ్రామ స్థాయి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించిందని ఆయన తెలిపారు. పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, గృహాలు వంటి పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలని అన్నారు. శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రస్థానంలో నిలిపేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రైతు, విద్యా వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలి



### - కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో నిర్వహించనున్న రైతు, విద్యా వారోత్సవాలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో మే 4–9 వరకు రైతు వారోత్సవాలు, మే 11–16 వరకు విద్యా వారోత్సవాలను ప్రయోజనకరంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని, గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా వారోత్సవాల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, హాజరు పెంపు, డ్రాప్ అవుట్‌ల పునః ప్రవేశంపై దృష్టి సారించాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. స్వీయ గణన ప్రక్రియను ఈ నెల 11లోగా పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు.

### వినతుల పరిష్కారంలో ఆలస్యం వద్దు..

రైతు వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ప్రజల వినతుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. అచ్చంపేటలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు వేగం పెంచుతున్నామని తెలిపారు. ప్రజా పాలన సభలు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణ పరిష్కారం అందించే వేదికగా మారాయని పేర్కొన్నారు.

సభలో భూమి, పెన్షన్లు, రేషన్ కార్డులు, గృహాలు వంటి సమస్యలపై వచ్చిన వినతులను నిర్దిష్ట గడువులో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి, కొత్త రేషన్ కార్డులు తదితర పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మే 4 నుంచి ప్రారంభమయ్యే రైతు వారోత్సవాలను విజయవంతం చేసి, పంట మార్పిడి, సేంద్రియ వ్యవసాయం పై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతి, ఆలస్యం లేకుండా పారదర్శకంగా పనిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు తమ శాఖల అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.



## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

### – భూ వివాదాలపై కుటుంబ సభ్యుల అనుమానం

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా:** మల్దకల్ మండలంలోని మద్దెల బండ తండాకు చెందిన చంద్రు నాయక్ (50) శనివారం అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు. ఈ ఘటనకు భూ తగాదాలే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. సర్వే నం.32లో 2 ఎకరాలు, సర్వే నం.375లో 1 ఎకరం భూమిపై దాయాదులతో వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున పొలం వద్ద ఉన్న చంద్రు నాయక్ ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసినట్లు అనుమానం వ్యక్తమవుతోంది.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. భూమి వివాదంపై పలుమార్లు అధికారులను ఆశ్రయించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

## శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు

**ముద్ర, శేరిలింగంపల్లి:** శిల్పారామం మాదాపూర్ లో శనివారం పద్మావతి ఆర్ట్ అకాడమీ, సూత్ర ఇన్స్టిట్యూట్ అఫ్ ఫైన్ ఆర్ట్స్ గురువులు క్రాంతికిరణ్ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. మైరా, హరిణి, యశస్వినీ, శాన్విత, హ్రితిక,సాత్విక, తన్వి, లాస్య, శాన్వి, లలితశ్రీ ప్రదర్శించారు. ప్రముఖ నాట్య గురువులు రోహిణి కందాల, వసంత సంధ్య, కీర్తన రెడ్డి లు ముఖ్య అతిథులుగా విచ్చేసి కళాకారులను అభినందించారు.

## సీజనల్ వ్యాధులపై పర్యవేక్షణ తప్పనిసరి

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** సీజనల్ వ్యాధులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ల్యాబ్ టెక్నీషియన్లను అధికారులు ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్లతో శనివారం పాత కలెక్టరేట్‌లోని ఆరోగ్య భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డా. రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ల్యాబ్ టెక్నీషియన్ కాలానుగుణ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వైద్యులు సూచించిన పరీక్షల కోసం రక్త నమూనాలను సేకరించి, అవసరమైన వాటిని తెలంగాణ డయాగ్నస్టిక్ ల్యాబ్‌కు పంపించాలని తెలిపారు. ఈ సమావేశంలో మలేరియా ల్యాబ్ జిల్లా ఇన్‌చార్జ్ పి. కళ్యాణ్ కృష్ణారావు, ఆరోగ్య విస్తీర్ణ అధికారి టి. పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రాంనగర్ కాలనీ హిందూ సమ్మేళనం

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కాలనీలో శనివారం జరిగిన రాంనగర్ బస్తి హిందూ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా భూమనందగిరి స్వామి, ముఖ్య వక్తగా అప్పల ప్రసాద్, మహిళా వక్తగా పబ్బ శారద మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు సుంకర అలివేల, జయప్రకాష్ నారాయణ చారి హాజరై ప్రసంగించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం హిందూ ఐక్యతకు సూచిక అన్నారు. మహిళా వక్త పబ్బ శారద మాట్లాడుతూ పుడమిని సం రక్షణ మన ధ్యేయం అన్నారు. ప్లాస్టిక్ వస్తువులు తగ్గించి పర్యావరణ సంరక్షణ చేయాలన్నారు. స్త్రీ శక్తి బలోపేతం చేయాలని అన్నారు. అనంతరం ప్రజలందరికీ భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమ్మేళన అధ్యక్షుడు పాలాది యాదయ్య, పిడికిల శేఖర్ బాబు, సంపత్, బ్రహ్మం, మేష లక్ష్మయ్య, శ్రీనివాసులు, సురేష్, శ్రీనివాస్ గౌడ్, పాండు, వేలాదిగా హిందువులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 03.05.2026
www.mudranews.in | @mudranews



పోహా ( అటుకులు):

లైట్‌గా ఉండి త్వరగా తయార వుతుంది. ఐరన్, కార్బ్స్ మంచి సోర్స్.



# ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

**- కరీంనగర్ కలెక్టర్ చిత్ర మిశ్రా**



**ముద్ర, కరీంనగర్:**
పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని.. అందులో భాగంగా శాఖల వారీగా సమస్యలు పరిష్కరిస్తూ అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చిత్రమిశ్రా పేర్కొన్నారు. శనివారం గంగాధర మండలం పాపాయ పల్లిలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా చొప్పదండి నియోజకవర్గం స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్, నియోజకవర్గస్థాయి క్లస్టర్ ఆఫీసర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ మహేశ్వర్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. స్త్రీ శిశు సంక్షేమం, స్థానిక సంస్థలు, ఇందిరమ్మ ఇల్లు, ప్రజావాణి సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయి భారీగా దరఖాస్తులు పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అధికారులంతా సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రభుత్వ పథకాలు పొందిన, పొం దుతున్న లబ్ధిదారుల వివరాలు వివరించారు. రైతు బీమా, కళ్యాణి లక్ష్మి, రైతు భరోసా, మహాలక్ష్మి, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, చేయూత పెన్షన్లు , అంగన్వాడి కేంద్రాల సేవలు, ఆయిల్ ఫామ్ సాగు వివరాలు వివరించారు.

**అర్హులందరికీ పథకాలు..**

ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూపార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. గతంలో రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం ఇచ్చేవారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సన్నబియ్యం ఇస్తూ పేదల కడుపు నింపుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు, గృహలక్ష్మి, అర్హులకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల జారీ, తదితర పథకాలు.. త్వరలో ప్రవేశ పెట్టే పథకాలను వివరించారు. గత ప్రభుత్వం వరి వేసుకుంటే ఊరేనని చెప్పిందని.. సన్న రకాలకు 500 బోనస్ ఇస్తూ రైతులకు అండగా ఉంటున్నామని వివరించారు. దేశంలో ఎక్కడలేని విధంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేశామని.. విద్యారంగాన్ని తీర్చిదిద్దేందుకు నియోజకవర్గానికి ఒక రెసిడెన్షియల్ స్కూల్ ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి జేఎన్టీయూ ఇస్తే.. నేడు మరిన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రాజెక్టులు పూర్తి చేసి రైతుల పాదలు కడుగుతానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తయితే చొప్పదండితోపాటు వేములవాడ నియోజకవర్గాలకు సాగునీటి కష్టాలు తప్పుతాయన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు భూసే కరణకు 23.5 కోట్లు మంజూరు చేశారని.. మరో 20 కోట్లు త్వరలో విడుదల అవుతాయని పేర్కొన్నారు.

**మరిన్ని పరిశ్రమలు..**

వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తానని అన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా పాలన చేస్తున్నట్లు వివరించారు . చొప్పదండి ప్రజలు తమకు దేవుళ్లతో సమానమని నన్ను గెలిపించినందుకు చివరి రక్తపు బొట్టు వరకు ప్రజాసేవ చేస్తానని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని.. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్, ఇతర అధికారులను కోరారు. క్షేత్రస్థాయిలో కేంద్రాలను తనిఖీ చేసి వాస్తవాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు.

## మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ మున్సిపల్ లోశనివారం కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి ల సమక్షంలో ఈ ఎన్నిక పూర్తయింది. గాజుల రవి కుమార్, మేడారం అపర్ణ, అస్మా బేగం, నోమన్ అలీ లు కో ఆప్షన్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి బాబు పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీ కి మరో ఘనత



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ మరో ఘనత సాధించింది. ఈ సంస్థ క్యాంపస్ ను 2025 డిసెంబర్ నుంచి 2026 మార్చి వరకు కేవలం మూడు మాసాల వ్యవధిలో 4,966 మంది విద్యార్థులు సందర్శించారు. ఈ మేరకు యు ఎస్ ఎ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ దీన్ని తమ పుస్తకంలో నమోదు చేసింది. డా. విఠల్ నేతృత్వంలో నిర్వహించిన విద్యా విస్తరణ కార్యక్రమం సందర్భంగా ఈ ఘనత సాధించినట్లు వీసీ గోవర్ధన్ వెల్లడించారు.

## గంజాయి స్వాధీనం

**ముద్ర, కోరుట్ల:**
కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కథలాపూర్ ఎస్సై రవి కిరణ్ తమ పోలీస్ సిబ్బందితో ధూంపేట గ్రామ శివారులో గల వరద కాలువ వద్ద ఇద్దరు యువకులు సుదీప్, భూషణ్ రావుపేట గ్రామానికి చెందిన గౌతమ్ ల వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పల్సర్ బైకును, రెండు సెల్ ఫోన్లను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కథలాపూర్ ఎస్సై రవి కిరణ్ తెలిపారు. పోలీస్ సిబ్బంది శ్రీకాంత్, శ్రీనునాయక్, దినేష్, ముత్తయ్య, అరుణ్, మధు, భగవాన్ పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్**




**బోథ్, ముద్ర:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా బోథ్ మండలంలోని పొచ్చెర ఫ్యాక్టరీ దగ్గర గల సాయి కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా ఎంపీ నగేష్ తో పాటు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోథ్ నియోజక వర్గానికి సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా తాను కృషి చేస్తున్నాని తెలిపారు. బోథ్ మండలంలో ఫైర్ స్టేషన్ లేకపోవడంతో అగ్ని ప్రమాదాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. త్వరలోనే పొచ్చెర ఫ్యాక్టరీ సమీపాన ఫైర్ స్టేషన్ ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బోథ్ ప్రాంతంలో గతంతో పోలిస్తే ప్రస్తుతం వ్యవసాయ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. రైతులకు నాణ్యమైన కరెంట్ ను అందించేందుకు వీలుగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సబ్ స్టేషన్ ల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఒప్పించి నియోజకవర్గంలో సుమారు 25 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ఆయా కుటుంబాలు ప్రగతి పథంలోకి వస్తాయన్నారు. బోథ్ లో త్వరలోనే నూతన ఆసుపత్రిని అందుబాటులో తెస్తామన్నారు. డాక్టర్ల కొరత లేకుండా చూస్తామన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు ఇస్తున్న రేషన్ బియ్యంను దళారులకు అమ్ముకోవద్దన్నారు. అవి ఆరోగ్యానికి మంచివన్నారు. ప్రభుత్వంతో కొట్లాడి నియోజకవర్గంకు ఎక్కువ మొత్తంలో ఇళ్లను మంజూరు అయ్యేలా చూస్తున్నానని, త్వరలోనే మరిన్ని ఇళ్లు మంజూరు అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు అంతరాయం లేకుండా ఇసుకను పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీటి కొరత రాకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించాడు. అనంతరం బోథ్ నియోజక వర్గానికి చెందిన వివిధ గ్రామాల 439 లబ్ధి దారులకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కు లతో పాటు బోథ్ మండలానికి చెం దిన 235 మంది లబ్ధి దారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

**ఏర్పాట్లలో అధికారులు విఫలం..**

అధికారులు ఏర్పాట్ల విషయంలో విఫలం చెందారనే అభిప్రాయం వ్యక్తమైంది. చాలా మంది కుర్చీలు దొరకక సమావేశం ముగిసే వరకు నిలబడాల్సి వచ్చింది. కొంతమంది మహిళలు కుర్చీలు దొరకక నేలపైన కూర్చున్నారు. పాత్రికేయులకు కేటాయించిన కుర్చీల్లో సమావేశానికి హాజరైన వారు కూర్చుండడంతో పాత్రికేయులు నిలబడాల్సివచ్చింది. పాత్రికేయులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పలితం లేకుండా పోయింది.

# రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం

**- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**



**ముద్ర, కోరుట్ల:**
కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ఆరోపించారు. మెట్ పల్లి మండలం లోని జగ్గసాగర్, ఆత్మకూరు గ్రామాల్లో ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శనివారం రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు గడిచినా ఇప్పటికీ సక్రమంగా ధాన్యం కొంటలేరన్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఎక్కడ పోసిన ధాన్యం అక్కడే నిల్వ ఉండిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. రైతులు రోజులు గడుపుతూ కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. మ్యాచర్ వచ్చినా సరైన విధంగా కొనుగోలు చేస్తాలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి రైతులకు ఎలాంటి ఆదరణ లేకుండా పోయిందన్నారు. సమయానికి యూరియా, రైతుబంధు సాయం అందించడంలో కూడా విఫలమైందని ఆరోపించారు. ఇప్పుడు పండించిన ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు మరింత నష్టపోతున్నారని తెలిపారు. వర్షాలు పడితే వరి పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వెంటనే అధికారులు స్పందించి వేగంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై అడిషనల్ కలెక్టర్ బీఎస్. లత తో ఫోన్ లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. వెంటనే కొనుగోళ్లు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పథకాలు అందించటమే లక్ష్యం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించటమే ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లక్ష్యమని కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ లో శనివారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఫలాలు ప్రజలకు మెరుగ్గా అందించటమే ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇప్పటికే గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, విద్యా, వైద్యం, అరైవ్ అలైవ్ వారోత్సవాలు నిర్వహించామన్నారు. అలాగే రైతు వారోత్సవాలు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. త్వరలోనే ఇందిరమ్మ జీవిత బీమా, ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం వంటి నూతన పథకాలు రానున్నాయని పేర్కొన్నారు. ఇటీవలి పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే ఉత్తమ స్థానంలో నిలిచిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు వివిధ పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, సీపీఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు పడిగెల భూషణ్, లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పిస్తాం




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక నిర్మల్ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా వచ్చే వారం నుంచి రైతు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొంటూ విజయవంతం చేస్తున్నారని చెప్పారు. మున్ముందు ఇదే ఉత్సాహంతో అన్ని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహిళా సంఘాలకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, డీఎంహెచ్వో రాజేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రాం రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతవుతున్న చెట్లు



**బోథ్, ముద్ర:** అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా పచ్చని చెట్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. బోథ్ మండలంలోని పొచ్చెర ఫ్యాక్టరీ సమీపాన అంతరాష్ట్ర రహదారికి ఇరు వైపుల నాటిన చెట్లు శనివారం అగ్నికి ఆహుతి అయ్యాయి. ఇదివరకే మండలంలోని చాలా చోట్ల ఇలా వందలాది చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. పంట పొలాల వద్ద చెత్తను తగులబెట్టేటప్పుడు ఆ మంట మొక్కలకు వ్యాపించడంతో దగ్ధమవుతున్నాయి. కొన్నిసార్లు ఈ మంటలు పక్కనే ఉన్న పంటలపై ముఖ్యంగా జొన్న, మొక్క జొన్న పంటలకు వ్యాపించి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిలిస్తున్నాయి. పంట చేతికి అందే సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. రోడ్డులకు ఇరువైపుల మొక్కలను నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వివిధ కారణాల రీత్యా ఎవరైనా ఒక్క చెట్టును నరికివేస్తేనే వేలాది రూపాయలు జరిమానా విధించే అటవీ శాఖ అధికారులు రోడ్డుకు ఇరువైపుల ఉన్న వందలాది మొక్కలు ఇలా కాలిపోతున్నప్పటికీ పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరింత నష్టం కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## మోడీ లిపి పత్రాలు లభ్యం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా పరిసర ప్రాంతాల్లో ప్రాచీన మోడీ లిపిలో రాసిన దస్తావేజులు వెలుగులోకి వచ్చినట్లు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు డా. తుమ్మల దేవరావు తెలిపారు. దేవగిరిని పాలించిన యాదవ రాజులు మహాదేవ, రామచంద్రుల కాలంలో, 13వ శతాబ్దంలో మంత్రిగా పని చేసిన హేమాడ్ పంత్ (హేమాద్రి పండితుడు) దర్బారుల్లో రహస్య భాషగా ఉపయోగించడానికి మోడీ లిపిని అభివృద్ధి చేశారని ఆయన వివరించారు. ఈ లిపిని ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో రాజుల ఆజ్ఞలు, గెజిట్‌లు, శాసనాలు, భూమి పత్రాలు, వంశవృక్షాలు నమోదు చేయడానికి ఉపయోగించేవారని తెలిపారు. సుమారు 150 సంవత్సరాల నాటి మోడీ లిపిలో రాసిన ఒక ఫర్మానాను తాను సేకరించినట్లు డా. దేవరావు పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాలో 1950 వరకు వ్యాపారస్తులు, కరణాలు తమ దస్తావేజులను మోడీ లిపిలోనే రాసేవారని ఆయన తెలిపారు. మరాఠీ భాష, దేవనాగరి లిపి ఆధారంగా ఈ లిపి రూపుదిద్దుకుందన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 03.05.2026
www.mudranews.in | @mudranews



**దోశ**
ఫెర్మెంటెడ్ ఫుడ్ కాబట్టి గట్ హెల్త్‌కు మంచిది. సాంబార్‌తో తింటే మరింత పోషకాలు.



## తహశీల్దార్‌కు సన్మానం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ఎంటిఏ (తెలంగాణ మీ సేవ ఆపరేటర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో శనివారం భువనగిరి తహశీల్దార్ సి.జగన్ మోహన్ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మీ సేవ సెంటర్‌కు వచ్చే ప్రజలకు మీ సేవ సర్వీసులను సత్వరంగా అందించాలన్నారు. సర్వీసులకు సంబంధించిన సరైన డాక్యుమెంట్లు స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం మీ సేవ సభ్యులు అడిగిన సందేహాలను పరిష్కరించారు. కార్యక్రమంలో టీఎం ఓఏ జిల్లా అధ్యక్షులు సయ్యద్ జానీ అలీ, కోశాధికారి సజన్‌లాల్, సభ్యులు భరత్, శ్రీశైలం, రాములు, పురుషోత్తం, సత్యనారాయణ, భాస్కర్, విశ్వేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నూతన బోరు మోటర్ బిగింపు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని న్యూ రామ్ నగర్ లో సుమారు లక్షా 20 వేల రూపాయలతో నూతన 7.5 హెచ్ పి బోరు మోటర్ శనివారం కౌన్సిలర్ జాలిగం విగ్నేష్ ఆధ్వర్యంలో బిగించారు. సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ఇక్కడ ఉన్న బోరు పలుమార్లు రిపేరు చేపించినప్పటికీ సమస్య తలెత్తడంతో ప్రజలకు నీటి సమస్య ఏర్పడుతుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి మోటారు మంజూరు చేయమని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. వేసవిలో నీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యేకి, సహకరించిన అధికారులకు వార్డు ప్రజల తరపున కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు మహేందర్, దేవేందర్, మునిసిపల్ సిబ్బంది కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

## ఆర్డీవో కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** జిల్లాలో ప్రజల వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం జారీ చేసిన తాజా మార్గదర్శకాల మేరకు, ఇకపై ప్రతి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం ఆయా రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు.ఈ కార్యక్రమానికి సంబంధిత ఆర్డీఓ (రెవెన్యూ డివిజనల్ అధికారి) నోడల్ అధికారిగా వ్యవహరించగా, అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై, ప్రజల వినతులను స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

# ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కృషి

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భువనగిరి నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా ధాన్యం కొనుగోలు వ్యవస్థను గణనీయంగా బలోపేతం చేస్తూ, పదేళ్లలో చేయని విధంగా రైతులకు అనుకూలమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి గరిష్టంగా 48 గంటల లోపే రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కొనుగోలు కేంద్రాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడ సమస్య వచ్చినా అక్కడికక్కడే పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతం కావడంతో కొంతమేర తాలు సమస్య ఉన్నప్పటికీ, అధికారుల సమన్వయంతో దాన్ని సమర్థంగా అధిగమిస్తున్నామన్నారు. ఎఫ్ సి ఐ, సివిల్ సప్లైయిస్ శాఖలు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం జిల్లాలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి భువనగిరి నియోజకవర్గంలోనే నమోదవుతుండటం గర్వకారణమన్నారు. రైతులు అధికంగా ఉత్పత్తి చేయడం వల్ల కొన్నిచోట్ల తాలు శాతం పెరగడంతో మిల్లర్లు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని 3–7 శాతం తాలు ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటే తేమ శాతం తగ్గిపోవడం వల్ల రైతులకు నష్టం కలగకుండా వేగవంతమైన కొనుగోలు ప్రక్రియను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ అధికారులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండి తాలు సమస్యతో పాటు ఇతర సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని వివరించారు. లారీల కొరత సమస్యను కూడా త్వరితగతిన అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నామని హామీ ఇచ్చారు. సివిల్ సప్లై మంత్రి, జిల్లా అధికార యంత్రాంగం ప్రతీ క్షణం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి గింజకు న్యాయం జరుగేలా కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేఖ బాబురావు, జిల్లా అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు డైరెక్టర్స్,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గైర్హాజరైన వారిపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తా

**తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్**



**ముద్ర, తుంగతుర్తి:** ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికను ప్రభుత్వం నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యే గ్రామ కార్యదర్శులు, అధికారులపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ హెచ్చరించారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని డీఆర్ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి నేరుగా చేరేలా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పట్ల ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా సహించబోమని, అలాంటి అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల వద్దకే ప్రభుత్వం చేరే విధంగా నియోజకవర్గ స్థాయిలోనే సేవలు అందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం విద్యా వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. జూన్ 2న పాఠశాల పునః ప్రారంభ సమయానికి పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని డీఈవో కు సూచించారు. ఈ సమావేశానికి డీఎస్పీ ప్రసన్న కుమార్, డిఈఓ అశోక్ కుమార్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** 99 రోజుల ప్రగతి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణం రాయగిరిలోని సోమా రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు., ప్రతి శాఖలో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు సమగ్రంగా వివరించగా, క్షేత్ర స్థాయిలో అమలు అవుతున్న పథకాలపై ఎక్కడైనా లోపాలు ఉన్నా వాటిని వెంటనే గుర్తించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలే ప్రభుత్వానికి ప్రాధాన్యతగా తీసుకుని, ప్రతి కుటుంబానికి నేరుగా ప్రయోజనం చేకూరే విధంగా పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.మహిళల సాధికారత కోసం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు చేస్తూ, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా మహిళలకు బస్ లో ప్రయాణం చేస్తున్నారని, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గిస్తున్నామని తెలిపారు.పేద ప్రజల ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకుని సన్నబియ్యం పంపిణీ,అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు,రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించడం ద్వారా రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు ప్రత్యేక రాయితీలు అందిస్తూ రైతుల ఆదాయం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇళ్లు మంజూరు కాగా, రెండో విడతలో మరిన్ని ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జూన్ 2వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు, అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం పెంపొందించాల్సిన అవసరం ఉందని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు..స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించడం జరుగుతుంది అన్నారు. అభివృద్ధి,సంక్షేమ పథకాలను, అమలు కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటుగా ప్రజల అవసరాలను స్థానికంగా తెలుసుకుని త్వరితంగా పరిష్కరించడం ఈ ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖా, మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శోభాయమానంగా శ్రీవారి వసంతోత్సవం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రంలో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. అన్న ప్రసాద వితరణలో భాగంగా శనివారం సుమారు 5వేల మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.

## అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందించాలి

**భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**ముద్ర, ఆలేరు :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆలేరు నియోజకవర్గంలోని ఇమ్మడి నరసింహారెడ్డి ఫంక్షన్ హాల్ నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించుటకు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజా ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేయాలనుకున్న పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలు ఎంతోమంది పేద ప్రజల లబ్ధిదారులకు చేరుతుందని, ప్రభుత్వం ఇస్తున్న పథకాలు ప్రజలకు చేరవేయడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమాన్ని పేద ప్రజలకు అందించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. గ్రామాలలో అభివృద్ధి ముందుకు సాగాలని దానికి ప్రతి ఒక్కరి కలిసి కట్టుగా పనిచేయాలని అన్నారు. సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించాలనదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. తెలంగాణ రైసింగ్ 2047 లో భాగంగా అభివృద్ధిలో ముందుకు పోవాలన్నారు. సర్పంచులు, వార్డు మెంబర్లు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా యంత్రాంగం అందరూ బాధ్యతాయుతంగా పని చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు 100% లబ్ధిదారులకు అందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గ్రామాలలో పార్టీలకు అతీతంగా పని చేసి గ్రామాభివృద్ధిలో తోడ్పడాలన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నియోజకవర్గ స్థాయి సంక్షేమ పథకాల అవగాహన కార్యక్రమం పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగించుకోవాలన్నారు. లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ గృహప్రవేశాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్, మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విమల వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో లు, తహసిల్దార్ లు, సంబంధిత అధికారలు, లబ్ధిదారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సీలింగ్ భూముల కబ్జా నిగ్గుతేల్చాలి




**ముద్ర, యాదగిరిగుట్ట:** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్యాయంగా కబ్జా చేసిన సీలింగ్ భూముల నిగ్గు తేల్చకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య హెచ్చరించారు. ఆలేరు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో దీక్షలను చేపడతామన్నారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని సైదాపురం, మాసాయిపేట గ్రామాలలో సర్వే నంబర్ 322, 728లలో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూమి సుమారు 1200 ఎకరాలను స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఓ వెంచర్ తో కుమ్మక్కై అక్రమంగా వెంచర్ నిర్వహించి రూ. కోట్లకు పడగెత్తారన్నారు. నిరుపేదలకు అక్రమంగా ప్లాట్లను కట్టబెట్టారన్నారు. ఇప్పుడు వారి ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఎంతో మంది నిరుపేదలు ప్లాట్లను కొనుగోలు చేశారన్నారు. ఒక్కో ప్లాట్లను ముగ్గురు నుంచి నలుగురికి రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. మాసాయిపేట గ్రామంలో సీలింగ్ భూమల కబ్జాలను వెలికితీసి నష్టపోయిన బాధితలకు అందజేయాలని రెండు వారాల క్రితం కలెక్టరేట్ కార్యాలయంలోని గ్రీవెన్ లో రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ వెంకారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. కొన్నేళ్లుగా సీలింగ్ భూమిలో ఎమ్మెల్యే చేపట్టిన అవకతవకలను వివరించామన్నారు. ఇందులో ఏఏ అధికారుల ప్రమేయం ఉందో వివరాలను అందజేశామన్నారు. కానీ ఇప్పటి వరకు అధికారులు విచారణ జరుపలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారులు కొమ్ముకాస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కాకముందే కార్లు, విలాసవంతమైన భవనాలు, ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థను నడిపానంటూ గతంలోనే నేను కోటీశ్వరుడిని అని ఎమ్మెల్యే పత్రికా సమావేశంలోనే తెలిపిన విషయాన్ని గుర్తు చేశారన్నారు. ఇన్ని కోట్ల ఆస్తులున్న ఎమ్మెల్యే ఎన్నికల సంస్థను సమర్పించిన అఫిడవిట్లో ఎందుకు తన ఆస్తులను చూపించలేదో చెప్పాలన్నారు. దీనిపై త్వరలో ఎన్నికల కమీషన్, ఏసీబీకి పిర్యాదు చేస్తామన్నారు. విలేకరులకు ఒక్కొక్కరికి ఎకరం భూమిని రాసిస్తామని మాటలు చెప్పి తప్పించుకోవద్దని ధమ్ముంటే ఇచ్చిన మాట ప్రకారం ఆలేరు నియోజకవర్గంలో ఉన్న విలేకరులకు ఎకరం భూమి రాసివ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ లో ఇచ్చిన పిర్యాదు పై అధికారులు తక్షణమే స్పందించాలని లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆలేరు నియోజకవర్గం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడితోపాటు ప్రతి మండల కేంద్రంలో దీక్షలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ మాజీ సెక్రటరి జనరల్ పాపట్ల నరహరి, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు ముక్కెర్ల సతీశ్ యాదవ్, నాయకులు కల్వకొలను సతీశ్ భట్, జీ రాజేశ్ యాదవ్ పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి కొరకు గ్రామ సభలు

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**ముద్ర, సూర్యపేట జిల్లా ప్రతినిధి:** .గ్రామాల అభివృద్ధి కొరకు గ్రామ సభలు ఉపయోగపడుతాయని కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవర్ అన్నారు. శనివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కోదాడ నియోజకవర్గ స్థాయి సమావేశం కోదాడలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన లో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు శానిటేషన్, త్రాగు నీరు, విద్యా, వైద్యం లపై అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో వేసవిలో త్రాగునీటి సమస్య లేకుండా ప్రణాళికలు చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అమలు అవుతున్నాయా లేదా అని అధికారులు మానిటరింగ్ చేస్తూ అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి ఏ విధంగా పరిష్కారం చేయాలనేది కార్యచరణ తో ముందుకు వెళ్లాలని సూచించారు. అభివృద్ధికి సంబంధించిన ఫైల్స్ పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు. పిహెచ్సి లను బలోపేతం చేసే క్వాలిఫైడ్ డాక్టర్లు, సిబ్బందితో గ్రామాలలో వైద్య సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కోదాడ ఏరియా హాస్పిటల్ అప్ గ్రేడ్ చేయడం జరిగిందని, ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద మరణిస్తే కుటుంబం రోడ్డున పడుతోందని. ఖచ్చితంగా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు. పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, వైస్ చైర్మన్ మల్లీశ్వరి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ, డీఎఫ్ ఓ సతీష్, ఆర్డీవో సూర్యనారాయణ ఎస్సీ డీడీ దయానందరాణి మున్సిపల్ కమిషనర్ రమాదేవి అడిషనల్ పిడి సురేష్, అన్ని శాఖల జిల్లా ధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, కౌన్సిలర్లు సర్పంచులు పాల్గొన్నారు.

**మూంగ్ దాల్ చిల్లా:**

ప్రోటీన్ రిచ్ బ్రేక్‌ఫాస్ట్. డైట్‌లో ఉన్న వారికి మంచి ఆప్షన్.



# ప్రజల సంక్షేమమే ధ్యేయం

**-మంత్రి పొన్నం ప్రభాకర్**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** ప్రజాల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని లక్ష్మి గార్డెన్స్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం హుస్నాబాద్ ఆర్డిఓ రామ్మూర్తి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. నియోజకవర్గంలో చేపట్టిన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వినిపించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల ఐదు నెలల పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. రూ.250 కోట్ల రైతు భరోసా నిధులను రైతులకు అందించామన్నారు. మరణించిన 679 మంది రైతు కుటుంబాలకు రూ.49 కోట్ల 96 లక్షల రైతు బీమా అందించామని చెప్పారు. రూ. 150 కోట్లతో 3,515 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. 57,963 గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 45 వేల మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. నది సంవత్సరాలు కొత్త పింఛ న్లు మంజూరు చేయలేదని, కాని తమ ప్రభుత్వం త్వరలోనే కొత్తగా మరింత మందికి పింఛన్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కొత్తగా 13000 మందికి రేషన్ కార్డులను మంజూరు చేశామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధిని కల్పించడమే కాకుండా రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. హుస్నాబాద్ నుంచయి అక్కన్నపేట వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి టెండర్లు పిలిచామని తెలిపారు.

### గౌరవెల్లి నిర్మాణం తన బాధ్యత..

గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి నిర్మాణం తన బాధ్యత అన్నారు. భూ నిర్వాసితులకు త్వరలోనే పేమెంట్ చేసి కాల్వల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కోహెడ మండలం తంగేళ్లపల్లిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. హుస్నాబాద్ పట్టణంలో శాతవాహన ఇంజనీరింగ్ కాలేజీ గతేడాది ప్రారంభమైందన్నారు. హుస్నాబాద్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా ఎల్లమ్మ చెరువు, అర్బన్ పార్క్, పట్టణ సుందరీకరణతో పాటు నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యాభివృద్ధిలో భాగంగా ఏటిసి సెంటర్ నిర్మాణం, న్యాక్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. 250 పడకలతో ఆసుపత్రి అభివృద్ధి చెందుతుందని, మెడికల్ కాలేజ్ కూడా సాంక్షన్ చేసుకొని పీజీ తో ప్రారంభిస్తామ న్నారు. ఒంటిమామిడి లాగా హుస్నాబాద్ లో హోల్సేల్ కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. చిగురుమామిడిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మిస్తామన్నారు. ముల్కనూరు, సైదాపూర్, ఎల్కతుర్తి బస్టాండ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

### పార్టీలకు అతీతంగా పనిచేద్దాం..

పార్టీలకు అతీతంగా హుస్నాబాద్ అభివృద్ధి కోసం అందరం కలిసి పని చేద్దా మని కోరారు. హుస్నాబాద్ లో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కోతుల బెడదని తగ్గించేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు.

కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ ప్రభు త్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేస్తున్న కృషిని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ జిల్లా ప్రజల రక్షణ, శాంతిభద్రతల పర్యవేక్షణకు సురక్ష నేత్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, నేతన్నబీమా చెక్కులను పంపిణీ చేశారు. హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్ లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతకు నిలయంగా సిద్దిపేట

**- ఎమ్మెల్యే హరీష్ రావు**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** సిద్దిపేట ఆధ్యాత్మికతకు నిలయంగా మారుతోందని స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. పట్టణంలోని 3వ వార్డు రంగదాంపల్లిలో పంచవటి హనుమాన్ దేవాలయం ప్రాంగణం లో నిర్మించిన అన్న ప్రసాద భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిద్దిపేట అన్నదానాలకు పెట్టింది పేరన్నారు. ఆధ్యాత్మికతకు, అన్నదానలకు నెలవు గా మారిందని తెలిపారు. హనుమాన్ దీక్ష బిక్ష కు బీజం వేసింది మన సిద్దిపేటేనని చెప్పారు. రావి చెట్టు హనుమాన్ దేవాలయం లో 41రోజులు, గణేష్ నగర్ హనుమాన్ దేవాలయం లో 21రోజులు, పంచముఖ హనుమాన్ దేవాలయం లో 21 రోజులు బిక్ష కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. రావి చెట్టు హనుమాన్ దేవాలయం, గణేష్ నగర్ హనుమాన్ దేవాలయంతో పాటు రంగాధంపల్లి లో మరో అన్నదానం కేంద్రం ప్రారంభించడం అభినందనీయమన్నారు. సిద్దిపేట లో చేసిన అన్ని భవనాలకు తన సహకారం అందించానని చెప్పారు. వేలాది మంది హనుమాన్ దీక్షలో పాల్గొంటారని, వారు బిక్ష చేసేందుకు ఈ అన్నదాన భవనం లు ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. ఎన్నో కార్యక్రమాలకు సిద్దిపేట నెలవు గా మారిందన్నారు. మట్టి వినాయకుల పంపిణి మొట్టమొదలు మన సిద్దిపేట లోనే ప్రారంభం చేసుకున్నామన్నారు. రంగదాంపల్లి గ్రామంలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసుకొని ఆదర్శం గా నిలుపుకున్నామని చెప్పారు. అన్నదాన భవనం కు సహకరించిన దాతలను సత్కరించారు.

## ప్రగతి ప్రణాళికలో భాగస్వాములు కావాలి

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. అభివృద్ధి కోసం ఇన్నోవేషన్ ఐడియాలు అమలు చేయాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం జిల్లాలో దిగ్విజయంగా జరుగుతున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఐడీఓసీలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. మెదక్ ఆర్డీఓ రమాదేవి, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మెదక్, రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ లు రాధికా భూపతి రాజు, లావణ్య, వైస్ చైర్మన్లు దొంతి నరేష్ గౌడ్, నవనీత, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా వివిధ శాఖల ద్వారా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ ను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లో గ్రామసభలు నిర్వహించి శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేసి అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా హెల్త్ కార్యక్రమాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ద్వారా అరైవ్ – అలైవ్ కార్యక్రమం నిర్వహించి రోడ్డు భద్రతపై కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. గ్రామస్థాయిలో రోడ్డు సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. క్రైమ్ కంటే రహదారి ప్రమాదంలో చాలామంది మరణిస్తున్నారని తెలిపారు. ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల పేరుతో మోసం

**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను వంచించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. శనివారం మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో బీజేపీ కార్యకర్తల సమావేశానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అభయహస్తం హామీలు ఇప్పుడు అబద్ధాల హస్తంగా మారాయని విమర్శించారు. ముఖ్యంగా మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయకుండా ప్రభుత్వం కాల యాపన చేస్తోందని మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ అందక రాష్ట్రంలోని రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పుల ఊబిలో కూరుకుపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్నట్లు వె ల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా సుమారు రూ. 7,800 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. వరంగల్‌లోని మా మ్నూర్ విమానాశ్రయ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రధాని ప్రారంభించ నున్నారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి రాములు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్, నియోజకవర్గ ఇంచార్జి పంజా విజయ్ కుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, సర్పంచులు బక్కయ్యగారి యాదగిరి, ఆకుల రమేష్, ముఖ్య నేతలు పబ్బ సత్యం గుప్తా, చింతల శేఖర్, వెల్మల సిద్ధ రాములు, అవినాష్ రెడ్డి, గోల్పర్తి బాపురెడ్డి, ఫర్టిలైజర్ రమణ, భానుచందర్, తీగల శ్రీనివాస్ గౌడ్, రాంపూర్ ప్రవీణ్, నరేందర్, బాసం అనిల్ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రాయిస్తే పీడీ యాక్టు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్అ ధికారులను ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు నిర్వహించాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ లో వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్. సీడ్ కార్పొరేషన్ల సమన్వయంతో వానాకాలం 2026 లో పర్యవేక్షణ, అమలు కోసం విత్తనాలు, ఎరువుల కన్వర్జెన్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. నకిలీ విత్తనాల రహిత జిల్లాగా మెదక్ ను తీర్చిదిద్దాలని కోరారు. మెదక్ జిల్లాలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడటం, వచ్చే వానాకాలం పంటలకు ఎరువులు, పురుగు మందులు రైతులకు బఫర్ స్టాక్ అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఆర్డీవోలు రమాదేవి, రామకృష్ణ, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ రుద్రమూర్తి, సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## 5న నిరాహార దీక్ష

**ముద్ర, హైదరాబాద్:** కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి ఈనెల 5న సామూహిక నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు టీజీఈ జేఏసీ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి తెలిపారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, ఫించన్‌దారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలో ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై సామూహిక నిరాహార దీక్షను చేపడుతున్నట్లు తెలిపారు.

## పెండింగ్ కేసులు పరిష్కరించాలి

**- ఎస్పీ శ్రీనివాస్ రావు**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** పెండింగ్ కేసులను వేగవంతంగా పూర్తి చేసి, నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం నార్సింగి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా సమగ్ర భద్రత కల్పించాలని పేర్కొన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకం కావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్బీ ఇన్ స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ సృజన పాల్గొన్నారు.

## ఉద్యమాలకు సిద్ధం కావాలి




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** మే డే స్ఫూర్తితోటి కార్మికవర్గం ఉద్యమాలకు సిద్ధం కావాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ (బీఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు సిద్ది రాములు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన మే డే అమరవీరుల సంస్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను అమలు చేయడంలో నిర్లక్షం వీడాలని కోరారు. ప్రతి కార్మికునికి ఈఎస్ ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాల చట్టం అమలు చేయాలని, పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని, 8 గంటల పని విడానాన్ని అమలు చేయాలని కోరారు. బీడీ కార్మికుల పెన్షన్ వెయ్యి రూపాయల నుంచి ఐదు వేల రూపాయలకు పెంచాలన్నారు. ప్రతి కంపెనీ నెలలో 26 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదురుకొల్లా ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కడవేర్గు శ్రీహరి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోసికొండ నర్సిం లు, టెకదరు యూనియన్ రాష్ట్ర నాయకులు తిరుపతి గౌడ్, బుర్ర కార్మికురాలు అనిత, రాష్ట్ర నాయకులు తలారి ప్రవీణ్, బీడీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దబ్బేట ఆనంద్, నాయకులు శివ రాత్రి శ్రీనివాస్, ర్యాకం మహేష్, వాజిత్, దానబోయిన రాజు, చంద్రం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com